మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త



## ఎంపి రఘునందన్‌రావును కలిసిన వడ్డేపల్లి ప్రసాద్



రఘునందన్‌రావును సన్మానిస్తున్న వడ్డేపల్లి

**గజ్వేల్, ఫిబ్రవరి 27 (ప్రభాతవార్త):** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధి ప్రజ్ఞాపూర్‌లోగల త్రిశక్తి ఆలయాన్ని శుక్రవారం మెదక్ ఎంపి రఘునందన్‌రావు సందర్శించి అమ్మవార్లను దర్శించుకొని పూజలు నిర్వహించారు. అక్కడి నుండి 4వ వార్డు బిజెపి కౌన్సిలర్ రొట్టెల శ్రీనివాస్ నివాసానికి వెళ్లి భోజనం చేశారు. అనంతరం అక్కడే ఉన్న బిజెపి పట్టణ ఉపాధ్యక్షుడు వడ్డేపల్లి ప్రసాద్ ఎంపి రఘునందన్‌రావును శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ఎంపి రఘునందన్ రావుకు ఇచ్చిన మాట ప్రకారం 4వ వార్డులో కమలం పువ్వును గెలిపించినట్లు పేర్కొన్నారు. వారితో పాటు నల్ల శ్రీనివాస్, వందు తదితరులు ఉన్నారు.

## అడిషనల్ కలెక్టర్‌ను కలిసిన మున్సిపల్ కమిషనర్

**గజ్వేల్ టౌన్, ఫిబ్రవరి 27 (ప్రభాతవార్త):** సిద్దిపేట జిల్లా అడిషనల్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన అబ్దుల్ హమీద్‌ను శుక్రవారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పట్టణ అభివృద్ధి, పారిశుద్ధ్య నిర్వహణ, మౌలిక వసతుల విస్తరణ, ప్రజాసేవల మెరుగుదల వంటి అంశాలపై చర్చించినట్లు తెలిపారు. పట్టణ అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయడం, ప్రజలకు సౌకర్యవంతమైన సేవలు అందించేందుకు పరిపాలన పరంగా అవసరమైన చర్యలను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలని అడిషనల్ కలెక్టర్ సూచనలు ఇచ్చినట్లు మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్ తెలిపారు.



అడిషనల్ కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ హైమావతి

## విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు

### సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

ఆయిల్‌ఫామ్ సాగులో ఆయిల్‌ఫెడ్ అధికారుల పనితీరు మందకొడిగా సాగుతుందని...విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేదిలేదని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి హెచ్చరించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఉద్యాన వనశాఖ, ఆయిల్‌ఫెడ్ అధికారులతో ఆయిల్‌ఫామ్ సాగుపై సమీక్ష నిర్వహించి మాట్లాడారు. ఆయిల్‌ఫెడ్ అధికారులకు ఆయిల్‌ఫామ్ సాగు మాత్రమే పని అని ఉద్యానవన,వ్యవసాయశాఖ అధికారులకంటే మెరుగ్గా పనిచేయాలని ఆదేశించారు.మండలాల్లో ఆయిల్‌ఫెడ్ అధికారులు చురుకుగా పనిచేయాలని, వ్యక్తిగతంగా కేటాయించిన లక్ష్యాన్ని చేరుకోవాలని ఆదేశించారు.ఆయిల్‌ఫామ్ సాగుచేయడానికి రైతులను ప్రోత్సహించాలని చెప్పారు. అనంతరం కలెక్టరేట్‌లో జిల్లా వ్యవసాయశాఖ అధికారులతో ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియపై జూమ్ సమావేశం ద్వారా సమీక్షా నిర్వహించారు. ఆయా కార్యక్రమాలలో జిల్లా ఉద్యానవనశాఖ అధికారి సువర్ణ, జిల్లా వ్యసాయశాఖ అధికారి స్వరూపరాణి తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ పరీక్షలు సజావుగా జరగాలి

### మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్



ఇంటర్ పరీక్షలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్

**నర్సాపూర్, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త :** ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా సజావుగా జరగాలని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ స్పష్టం చేశారు. శుక్రవారం నర్సాపూర్‌లోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్‌పరీక్షలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతిమాసింగ్ మాట్లాడుతూ, జిల్లాలో ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరగాలని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులులేకుండా చూడాలని చెప్పారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్ సరఫరా, అత్యవసర మందులు, వైద్యసిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమికోన్నత పాఠశాలను న్యాయమూర్తి తనిఖీ



మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలిస్తున్న న్యాయమూర్తి సంతోష్ కుమార్

**సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త :** జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె.సాయిరమాదేవి ఆదేశాల మేరకు శుక్రవారం ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జి, ఎఫ్ఎసి సెక్రటరీ, జిల్లా లీగల్ ఆథారిటీ సంతోష్‌కుమార్ జిల్లా కేంద్రంలోని కాళ్ల కుంట కాలనీలోని ప్రాథమికోన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా తరగతిగదులు, పరిసరాలను, స్కూల్ హాజరు పట్టికను పరిశీలించారు. మధ్యాహ్న భోజన నాణ్యత, వంటగది పరిసరాలు, నిల్వ ఉన్న ఆహార పదార్థాలను పరిశీలించారు. పిల్లలకు కల్పిస్తున్న వసతులు బాగున్నాయని కితాబ్ ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గొంగ్లూర్‌ను సందర్శించిన జపాన్ బృందం

**పుల్‌కల్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** మండల పరిధిలోని గొంగ్లూర్‌లో కల్తీ లేని ఉత్పత్తులతో మహిళలు స్వయం ఉపాధి పొందుతున్నారని జపాన్ బృందం కితాబిచ్చింది. గ్రామంలోని సర్వోదయ ఉమెన్ ఎంటర్ ప్రైన్యూర్స్ పరిశ్రమను ఐఐటీ హైద్రాబాద్, జపాన్ బృంధం శుక్రవారం సందర్శించి మహిళలు తయారు చేస్తున్న కల్తీ లేని సహజ ఉత్పత్తులను పరిశీలించారు. ఉత్పత్తి ఉపాధి నినాదంతో 150 మంది స్వయం సహాయక సంఘాల మహిళల భాగస్వామ్యంతో ఉత్సత్తులను తయారు చేయడం అభినందనీయమని బృంధం బాధ్యులు కొనియాడారు. పరిశ్రమలో కట్టె గానుగ నూనెలు, సాంప్రదాయకంగా తయారు చేసిన పప్పులు, చిరుధాన్యాలు, చేతితో తయారు చేసిన సబ్బులు, సర్ఫులు, హౌజ్ కీపింగ్ మెటీరియల్స్ తదితర పలు రకాల సహజ ఉత్పత్తులను తయారుచేసి మార్కెటింగ్‌చేయడాన్ని పరిశీలించారు. ఉత్పత్తి ప్రక్రియలు, మార్కెటింగ్ విధానాలు స్వయం సహాయక మహిళ భాగస్వామ్యం గురించి ఐఐటీ హైద్రాబాద్, జపాన్ బృంధం మహిళలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ యాదగిరి, ఉప సర్పంచ్ శ్రీకాంత్‌గౌడ్, రాజేశ్‌రెడ్డి, నరసింహారెడ్డి, గోపాల్‌రెడ్డి, మల్లికార్జున్ పాల్గొన్నారు.



గొంగ్లూర్‌ను సందర్శించిన జపాన్ బృందం బాధ్యులు

# వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు

### సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య




మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

**సంగారెడ్డి మున్సిపాలిటీ, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త**

వేసవి కాలంలో జిల్లాలో ఎక్కడా తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్లు, టుబి హెచ్‌కె గృహాలు, ఎన్ఆర్ఈజీఎస్ పనులు, గ్రామీణ తాగునీటి సరఫరాపై శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ ఆయా శాఖల అధికారులు, ఎంపీడీవోలతో సమావేశం నిర్వహించి మండలాల వారీగా సమీక్షించారు. జిల్లాలో వేసవిలో నీటి సమస్యలు తలెత్తకుండా ప్రతి గ్రామంలో ముందస్తు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఏ మండలంలోనూ ప్రజలు తాగునీటి కోసం ఇబ్బంది పడకూడదన్నారు. బోర్వెల్స్ ఫ్లషింగ్, మోటార్ల రిపేర్, పైపుల లీకేజీ రిపేర్లు తదితర పనులకు గ్రామ పంచాయతీనిధులు వినియోగించాలని సూచించారు. తాగునీటి నాణ్యతను క్రమం తప్పకుండా పరీక్షించాలని, ఏవేని సమస్యలు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. నీటి సమస్యలు పునరావృతమవుతున్న గ్రామాలను ఎంపీడీవోలు స్వయంగా సందర్శించి ఆర్డబ్ల్యూఎస్ అధికారులతో సమన్వయం చేసుకుని శాశ్వత పరిష్కారం చూపాలని చెప్పారు.ఎన్ఆర్ఈజీఎస్ కింద మెటీరియల్ కంపోనెంట్‌కు అనుగుణంగా గ్రామపంచాయతీల్లో లేబర్ వినియోగం పెరగాలని, షెల్ఫ్ ఆఫ్ వర్క్స్ సక్రమంగా అమలుచేయాలని ఎంపీడీవోలకు సూచించారు. చేపట్టిన పనులను నిర్దేశిత గడువులో పూర్తి చేయాలన్నారు. మంజూరైన అంగన్వాడి భవనాలను పాఠశాల ప్రాంగణంలో ఉండేలా మార్కింగ్ చేసి గ్రౌండింగ్ చేయాలని తెలిపారు. స్కూల్ టాయిలెట్లు, అంగన్వాడి, గ్రామపంచాయతీ భవనాలు, పాఠశాల కాంపౌండ్ వాల్స్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో అర్హులైన లబ్ధిదారులకు మంజూరులు అందేలా చర్యలు తీసుకోవాలని, పెండింగ్‌లో ఉన్న ఇళ్ల గ్రౌండింగ్, నిర్మాణ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. అవసరమైతే ఎస్‌హెచ్‌జీ గ్రూపుల ద్వారా రుణ సౌకర్యం కల్పించాలని, చెల్లింపుల సమస్యలు ఉంటే వివరాలు సమర్పించా లని సూచించారు. టుబిహెచ్‌కె గృహాల జాబితాను సేకరించి సమర్పించాలని ఆదేశించారు. సమావేశం లో జడ్పీ సీఈవో జానకిరెడ్డి, డీఆర్డీఓ జ్యోతి, హౌసింగ్ పీడీ చలపతిరావు, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ రఘువీర్, ఎంపీడీవోలు, ఇంజనీరింగ్ అధికారులు, హౌసింగ్ ఏఈలు, ఎంపీఓలు, ఏపీవోలు పాల్గొన్నారు.



శిక్షణాలో పాల్గొన్న జగదేవ్‌పూర్ మండల సర్పంచ్‌లు

## సర్పంచ్‌లకు శిక్షణతో గ్రామాభివృద్ధికి బాటలు

**జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 27 (ప్రభాతవార్త):** పంచాయతీరాజ్ చట్టంలో భాగంగా ఇటీవల నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లకు సిద్దిపేట జిల్లా కేంద్రంలోని మందపల్లిలోగల న్యాక్ శిక్షణ కేంద్రంలో విడతల వారీగా జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీల సర్పంచ్‌లకు పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఈనెల 23 నుండి 27 వరకు జగదేవ్‌పూర్, బెజ్జంకి, వర్గల్, నంగునూరు మండలాల్లోని అన్ని గ్రామపంచాయతీల సర్పంచ్‌లకు శిక్షణ కార్యక్రమం కొనసాగింది. శుక్రవారం ఈ శిక్షణ కార్యక్రమం ముగియడంతో శిక్షణలో పాల్గొన్న జగదేవ్‌పూర్ మండల సర్పంచ్‌లు మాట్లాడుతూ ఐదు రోజులుగా సర్పంచ్‌ల విధులు, బాధ్యతలపై, పంచాయతీరాజ్ చట్టం అమలుపై పలు అంశాలను శిక్షకులు వివరించారని తెలిపారు. దీంతో శిక్షణ పొందిన సర్పంచ్‌లుగా గ్రామంలోని పలు సమస్యలను ప్రజల భాగస్వామ్యంతో పరిష్కరించుకుంటూ గ్రామాభివృద్ధికి బాటలు వేస్తామన్నారు. జగదేవ్‌పూర్ మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు పనుగట్ల శ్రీనివాస్‌గౌడ్, పీర్లపల్లి సర్పంచ్ ఓంప్రకాష్, తిమ్మాపూర్ సర్పంచ్ రాజులు మాట్లాడుతూ ప్రభుత్వం నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లకు శిక్షణ ఇవ్వడంవల్ల తమకు తెలియని విషయాలు ఎన్నో నేర్చుకున్నామని, గ్రామంలో పలు సమస్యలను ఏ విధంగా ఎదుర్కోవాలనే అంశాలను నేర్చుకున్నామని, గ్రామంలో యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా వారిని ఏ విధంగా సన్మార్గంలో నడిపించాలనే విషయాలు తెలుసుకున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో తమ గ్రామాలను ఉత్తమ గ్రామపంచాయతీలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచ్‌లు రాచమల్ల ఎల్లేష్, విద్యాధర్, జుర్రు స్రవంతి వెంకటేశం, కుడుదుల రజిత పరశురాం, చెక్కల పరమేశ్వర్, నర్ర కనకయ్య, హేమ బాలమణి, ఏలూరి సంధ్య శ్రీనివాస్, చెరుకు రజిత అశోక్, పుష్ప, తుమ్మల జ్యోతి, క్యాసారం కుమార్, మహేష్, ధీన రాజలింగం, రాజుగౌడ్, లింగాల మౌనిక, ఎం.బాలయ్య, కర్రె పద్మారావు, రజిని, దాసరి రజిత, ఏ.కవిత లోలాకర్‌రెడ్డి, కె.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా యువజన అధికారి రంజిత్‌రెడ్డి

## దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకం

**సంగారెడ్డి మున్సిపాలిటీ, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త :** సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ కళాశాలలో కేంద్ర ప్రభుత్వ యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ సహకారంతో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) మరియు మేరా యువ భారత్, సంగారెడ్డి ఆధ్వర్యంలో జిల్లా స్థాయి వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రవీణ, జిల్లా యువజన అధికారి రంజిత్‌రెడ్డి సంయుక్త ప్రకటనలో తెలిపారు. యువతను దేశాభివృద్ధిలో భాగస్వామ్యం చేయడం, సామాజిక సమస్యలపై యువతరంలో అవగాహన పెంపొందించడం లక్ష్యంగా ఈ యూత్ పార్లమెంట్ కార్యక్రమాన్ని నిర్వహించామని వారు తెలిపారు. ఎమర్జెన్సీ విధించి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా"భారత ప్రజాస్వామ్యం పై ఎమర్జెన్సీ ప్రభావం" అనే అంశంపై యువత తమ అభిప్రాయాలను వ్యక్తపరిచారు. ప్రజాస్వామ్యంలో స్వేచ్ఛ, మానవ హక్కుల ప్రాముఖ్యతను వారు విశదీకరించారు. సంగారెడ్డి జిల్లాలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం తొలిసారిగా నిర్వహించడం గర్వకారణమని తెలిపారు. జిల్లా స్థాయి వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్‌లో విజేతలైన ఐదుగురు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అవుతారని, అక్కడ విజయం సాధించిన వారు ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్‌లో పాల్గొనే అవకాశం పొందుతారని వివరించారు. జిల్లా వ్యాప్తంగా 18 నుండి 25 సంవత్సరాల మధ్య వయస్సు గల యువతలో 400 మందికి పైగా నమోదు చేసుకోగా, అందులోంచి ఎంపికైన 62 మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి జడ్జీలుగా సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ అఖిలేష్‌రెడ్డి, లా కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, ఉస్మానియా విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ శ్రీలత, యువజన అధికారి శశాంక్, కళాశాల ప్రొఫెసర్ పి. సుజాత వ్యవహరించారు. కార్యక్రమంలో మై భారత్ సంగారెడ్డి అధికారి కిరణ్ కుమార్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నిర్మల, డాక్టర్ జగదీశ్వర్, ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ సదయకుమార్, డాక్టర్ వాణి, డాక్టర్ జోష్నా, డాక్టర్ వల్లి సౌభాగ్యం, ఉమామహేశ్వరి, కళాశాల అధ్యాపక బృందం, అడ్మినిస్ట్రేటివ్ అధికారి కామరాజ్, జిల్లాలోని వివిధ కళాశాలల విద్యార్థులు, యువత పాల్గొన్నారు.

## విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొన్న ప్రతాప్‌రెడ్డి

**గజ్వేల్ టౌన్, ఫిబ్రవరి 27 (ప్రభాతవార్త):**

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని 3వ వార్డులో జరిగిన శ్రీ నల్లపోచమ్మ, శ్రీ ఎర్రపోచమ్మ అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనతో పాటు గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ గంగిశెట్టి చందన రవీందర్, కౌన్సిలర్లు, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# కాళేశ్వరం నీళ్లకు సజీవ సాక్ష్యాలు పచ్చని పంట పొలాలే

### మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు

**నంగునూర్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త :**

పారె కాలువలు...పచ్చని పంట పొలాలే కాళేశ్వరం నీళ్లకు సజీవ సాక్ష్యాలని..సిఎం రేవంత్‌రెడ్డి మైసంపల్లికి వచ్చి చూడు.. కాళేశ్వరం నీళ్లు పారుతున్నాయ లేదా తెలుస్తుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు అన్నారు.సిద్దిపేట జిల్లా నంగునూర్ మండలం మైసంపల్లి గ్రామంలో శుక్రవారం పెద్దమ్మ దేవాలయ ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి మాట్లాడారు. కరువు ప్రాంతంగా ఉన్న ఈ నేలలో కాళేశ్వరం నీళ్లు తెచ్చిన ఘనత మాజీ సిఎం కెసిఆర్‌దేనని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టును కట్టుకున్నాం కనకనే 80 వేల ఎకరాల్లో సిద్దిపేటలో పంట పండుతుందన్నారు. అనాడు కరోనా వచ్చిన కెసిఆర్ రైతుబంధు ఆపలేదని నేటి కాంగ్రెస్ సర్కార్‌లో మాత్రం రైతుబంధు రావడం లేదన్నారు. మూడు పంటలకు రైతుబంధుకు ఎగనామం పెట్టిండు..సగం రుణమాఫీ చేసి రేవంత్‌రెడ్డి చేతులు దులుపుకున్నారని తెలిపారు. కెసిఆర్ హయాంలో యూరియా మన ఇంటి దగ్గరికి వచ్చేదని ఇప్పుడు యూరియా కావాలంటే లెక్కలేనన్ని తిప్పులు తప్పడంలేదన్నారు. కాంగ్రెస్ సర్కార్ వచ్చిన తర్వాత చేప పిల్లల పంపిణీ అడ్రస్ లేదన్నారు. అబద్దాలతో కాంగ్రెస్ ప్రజలను మోసం చేసిందని మండిపడ్డారు. కెసిఆర్ కిట్టు, కళ్యాణ లక్ష్మీ బంద్ అయిందన్నారు. మైసంపల్లిని గ్రామ పంచాయతీ ఏర్పాటుచేసుకొని ఎంతో అభివృద్ధి చేసుకున్నామన్నారు. అనంతరం వెంకటాపూర్ గ్రామంలో హనుమాన్ దేవాలయ ప్రథమ వార్షికోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయానికి తన వంతుగా రూ.లక్ష విరాళం అందించానని అక్క, చెల్లెలు అంజనేయస్వామికి కిరీటాన్ని చేయించాలని కోరారని వచ్చే ద్వితీయ వార్షికోత్సవం వరకు అంజనేయస్వామికి కిరీటాన్ని చేయించి ఇస్తానని తెలిపారు. అనంతరం ఆయా గ్రామాల్లో హరీష్‌రావును మెమోంటోలు, స్వామివారి చిత్రపటాలతో ఘనంగా సత్కారించారు. ఆయా కార్యక్రమాలలో ప్రజాప్రతినిధులు, పార్టీశ్రేణులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హరీష్‌రావు



కుందన్ వాణిపల్లి పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలించిన ఎంపీఓ

'వార్త'కు స్పందన

## పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలించిన ఎంపిఒ

**అక్కన్నపేట, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త :** మండలంలోని కుందన్ వాణిపల్లి గ్రామ పల్లె ప్రకృతి వనం మందుబాబుల అడ్డాగా మారిందనే శీర్షికతో శుక్రవారం 'ప్రభాతవార్తలో వార్త ప్రచురించగా ఎంపీఓ శివనాగేష్ తక్షణమే స్పందించారు. సమస్య తీవ్రతను దృష్టిలో ఉంచుకుని శనివారం ఆయన వనాన్ని సందర్శించి పరిస్థితులను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో అభివృద్ధి కోసం ఏర్పాటుచేసిన పల్లె ప్రకృతి వనాన్ని కాపాడడం గ్రామపంచాయతీ ప్రాథమిక బాధ్యత అని, వనం ప్రాంగణంలో మద్యం తాగడం, ఖాళీ సీసాలు, చెత్త వేయడంవంటి చర్యలను కట్టడి చేసేందుకు కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వనాన్ని శుభ్రపరిచి ప్రజలకు విశ్రాంతిస్థలంగా ఉపయోగపడేలా తీర్చిదిద్దుతామని, అవసరమైనచోట్ల హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు భద్రతా చర్యలను బలోపేతం చేస్తామని వెల్లడించారు. పర్యవేక్షణను క్రమం తప్పకుండా కొనసాగిస్తూ ఇలాంటి ఘటనలు మళ్లీ చోటుచేసుకోకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## ఇష్టారాజ్యంగా రోడ్లపై వాహనాల నిలిపివేత

### హెచ్చరికలకే పరిమితమైన అధికారులు



రోడ్డుపై అడ్డదిడ్డంగా వెళ్తున్న వాహనాలు

**బెజ్జంకి, ఫిబ్రవరి 27,ప్రభాతవార్త :**

మండల కేంద్రంలో రోడ్లను అక్ర మించి నిర్మాణాలు చేపడుతున్నా అక్రమార్కులు అధికారులు వత్తాసు పలుకుతున్నారనే ఆరోపణలు తలెత్తున్నాయి. అక్రమాలపై అధికారులు చూసిచూడనట్లు వ్యవహరించడంతో ప్రజల్లో అనుమానాలు మరింత బలపడుతున్నాయి. రోడ్లపై విచ్చలవిడిగా ద్విచక్ర వాహనాలు నిలుపు తుండడంతో రోడ్లు ఇరుకుగామారి ఇతర వాహనదారులు తీవ్ర ఇబ్బం దులు పడుతున్నారు. వ్యాపారులు రోడ్లను ఆక్రమించి తమ వ్యాపార సామాగ్రిని నిల్వచేస్తుండడం, విచ్చల విడిగా వాహనాలు నిలుపడంతో ప్రధాన రోడ్డు రద్దీగా మారుతుంది. కొద్ది నెలల క్రితం పోలీసుశాఖ అధి కారులు రోడ్లను అక్రమించి నిల్వ చేసిన వ్యాపార సామాగ్రిని తొలగిం చారు. రోడ్లపై వ్యాపారం నిర్వహించిన రోడ్లపై వాహనాలు నిలిపిన రూ.15 వేలు జరిమాన విధిస్తామని హెచ్చరికలు జారీ చేశారు. మళ్లీ యధావిధిగా రోడ్లపై విచ్చల విడిగా వాహనాలు నిలుపుతుండడంతో అధి కారులు పట్టించుకున్న పాపానపోవడం లేదు. అధికారుల తీరు మున్నాళ్ల ముచ్చటగా మారి హెచ్చరికలకే పరిమితమైందనే విమర్శలు ప్రజల్లో వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు పక్షపాత వైఖరి అవలంభించ కుండా నిష్పక్షపాతంగా వ్యవహరించి రోడ్లను అక్రమించి చేపట్టిన నిర్మాణాలపై..రోడ్లపై నిలుపుతున్న వాహనాలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## ఎస్పీ నుంచి నగదు రివార్డ్ అందుకున్న ఎస్ఐ

**పెద్దశంకరంపేట, ఫిబ్రవరి 27,ప్రభాతవార్త:** విధి నిర్వహణలో ప్రతిభ చూపిన పెద్దశంకరంపేట ఎస్సై ప్రవీణ్‌రెడ్డికి మెదక్ జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు చేతుల మీదుగా శుక్రవారం నాడు నగదు అవార్డు అందుకున్నారు. నేరాల నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణ, ప్రజలకు సమర్థవంతమైన సేవలందింపులో ఎస్సై ప్రవీణ్ రెడ్డి విశేష కృషి చేసినందుకు ఈ పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పోలీసు సిబ్బంది ప్రజల నమ్మకాన్ని పెంపొందించేలా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. నిబద్ధతతో పనిచేసే సిబ్బందిని ప్రోత్సహించేందుకే ఇలాంటి అవార్డులు అందజేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ మహేందర్, అల్లాదుర్గం సిఐ రేణుక రెడ్డి ఉన్నారు.




జిల్లా నుంచి నగదు రివార్డును అందుకుంటున్న ఎస్సై ప్రవీణ్ రెడ్డి

## ఆటో ఢీకొని వ్యక్తి మృతి

**పాపన్నపేట, ఫిబ్రవరి 27,ప్రభాతవార్త:** ఆటో ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని రామతీర్థం గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం...రామతీర్థం గ్రామానికి చెందిన కుర్మ సాయిలు(58) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నడు. కాగా గురువారం గ్రామంలో పలు విందులలో పాల్గొని మండల కేంద్రమైన పాపన్నపేటకు ద్విచక్ర వాహనంపై వెళుతున్న క్రమంలో కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండలం ఆత్మకూరు గ్రామానికి చెందిన ఓ ఆటో పాపన్నపేట నుంచి స్వగ్రామానికి వేగంగా వెళుతూ ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో సాయిలుకు తీవ్ర గాయాలుకావడంతో వెంటనే చికిత్స నిమిత్తం పాపన్నపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించి ఇంటివద్ద వదిలి వెళ్లారు. అయితే రాత్రి నిద్రించిన మృతుడు శుక్రవారం ఉదయం నిద్రలేవకపోవడంతో కుటుంబీకులు వెళ్లిపరిశీలించగా అప్పటికే మృతిచెందినట్లు గమనించి వెంటనే గ్రామస్తుల సహకారంతో పాపన్నపేట పోలీసులకు సమాచారం అందివ్వడంతో పాపన్నపేట పోలీసులు హుటాహుటీన సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించి మృతుడి భార్య నాగమణి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా మృతుడికి భార్య నాగమణి ముగ్గురు కుమారులు ఉన్నారు.

## స్వయం పాలన దినోత్సవం



స్వయం పాలన జరుపుకుంటున్న విద్యార్థులు

**చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:**
మండల పరిధి సూరారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు శుక్రవారం స్వయం పాలన దినోత్సవం జరుపుకున్నారు. పదవ తరగతి విద్యార్థులు తోటి విద్యార్థులకు ఉపాధ్యాయులై పాఠాలను బోధించారు. జిల్లా కలెక్టర్‌గా నవనీత, అదనపు కలెక్టర్‌గా వైష్ణవి, డిఈవోగా శివ, ఎంఈవోగా వంశి, ప్రధానోపాధ్యాయులుగా సంధ్యలు వ్యవహరించారు. అనంతరం చక్కగా బోధించిన విద్యార్థులకు బహుమతులు అందించారు.

## హామీని నెరవేర్చిన సర్పంచి

**చిలిపిచెడ్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:**
శీలాంపల్లి గ్రామానికి చెందిన మంగలి రామయ్య అనే వ్యక్తి కొన్నిరోజుల క్రితం మరణించారు. అయితే ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం రాజేందర్‌రెడ్డి మృతుడి కుటుంబానికి రూ.10వేలు ఆర్థిక సహాయం అందించారు. అలాగే ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలో భాగంగా గ్రామంలోని పోతన్నగారి భార్గవి బలవంత్‌రెడ్డి దంపతులకు పుట్టిన ఆడబిడ్డకు రూ.10వేలు అందజేశారు. కార్యక్రమంలో రాంరెడ్డి, ఆనంద్‌రెడ్డి, నవీన్ రెడ్డి, రాజేందర్‌రెడ్డి, మాణిక్‌రెడ్డి, రాజిరెడ్డి, భూపాల్‌రెడ్డి ఉన్నారు.

## సమయపాలన పాటించకుంటే చర్యలు

**-ఎంఈవో దీప్లా రాథోడ్**



ఉపాధ్యాయసంఘనాయకులతో మాట్లాడుతున్న ఎంఈవో దీప్లారాథోడ్

**చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:**
ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు సమయపాలన పాటించకుంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఎంఈవో దీప్లారాథోడ్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రమైన చిన్నశంకరంపేటలోని మండల విద్యావనరుల కేంద్రంలో వివిధ ఉపాధ్యాయసంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. వివిధ ఆటల్లో రాణించే విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ అందించడానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో వివిధ ఉపాధ్యాయసంఘాల నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ ప్రొటీన్ దినోత్సవం

**హైదరాబాద్, ఫిబ్రవరి 27,ప్రభాతవార్త:**
జాతీయ గుడ్డు సమన్వయ కమిటీ మద్దతుతో,పౌల్ట్రీ ఇండియా ఆధ్వర్యంలో సికింద్రాబాద్, బోయిన్‌పల్లిలోని స్ట్రైకింగ్స్ ఫుట్‌బాల్ అకాడమీలో ప్రపంచ ప్రొటీన్ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా దైనందిన ఆహారంలో ప్రొటీన్ ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు.మానవ శరీరంలో కండరాల నిర్మాణం, రోగనిరోధక శక్తి పెంపు, పిల్లల ఎదుగుదల మరియు సంపూర్ణ ఆరోగ్యానికి ప్రొటీన్ అత్యంత అవసరమని నిపుణులు పేర్కొన్నారు. అయితే, భారతదేశంలో మెజారిటీ ప్రజలు రోజువారీ ఆహారంలో అవసరమైన మేర ప్రొటీన్ తీసుకోకపోవడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నా యని, ప్రొటీన్ లోపం దీర్ఘకాలిక అనారోగ్యాలకు దారితీస్తుం దని హెచ్చరించారు. ప్రస్తుతం భారత్‌లో ఏటా 130 బిలి యన్లకు పైగా గుడ్లు, 5 మిలియన్ మెట్రిక్ టన్నుల చికెన్ ఉత్పత్తి అవుతోందని తెలిపారు. దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు తక్కువ ధరలో లభించే అత్యంత నాణ్యమైన ప్రొటీ న్ వనరులలో పౌల్ట్రీ ఉత్పత్తులు ముఖ్యమైనవని చెప్పారు.ఈ కార్యక్రమంలో అండర్17 జాతీయ జట్టు కోచ్ జాకిర్ హుస్సేన్, చీఫ్ క్లినికల్ న్యూట్రిషనిస్ట్ డాక్టర్ కిరణ్మయి మా ట్లాడుతూ.. యువతలో ఫిట్‌నెస్, రోగనిరోధక శక్తి కోసం సమతుల్య ప్రొటీన్ ఆహారం ఎంతో అవసరమని నొక్కి చెప్పారు. పౌల్ట్రీ ఇండియా అధ్యక్షుడు ఉదయ్ సింగ్ బయాస్ మాట్లాడుతూ, "ప్రొటీన్ లోపం వల్ల కలిగే తక్కువ బరువు, రక్తహీనత వంటి సమస్యలను గుడ్లు, చికెన్ తీసుకోవడం ద్వా రా అధిగమించవచ్చు. శరీర నిర్మాణంలో ప్రొటీన్ కీలక పాత్ర పోషిస్తుంది, అందుకే దీన్ని జీవిత నిర్మాణ ఘటకంగా పిలవచ్చు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ సూచనల ప్రకారం, ప్రతి వ్యక్తి తన శరీర బరువులో ప్రతి కిలోకు ఒక గ్రాము ప్రొటీన్ తీసుకోవాలని అని తెలిపారు. ప్రజలకు నాణ్యమైన పోషకాహారాన్ని అందించడంలో పౌల్ట్రీ రంగం కృషి చేస్తోందని ఆయన పేర్కొన్నారు.

## నమ్మించాడు.. కిలో బంగారం కాజేశాడు

**- బంగారం దుకాణ వ్యాపారిని బురిడీ కొట్టించిన పాత నేరస్థుడు**
**- బంజారాహిల్స్ ఠాణాలో కేసు నమోదు**

**జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:**
బంగారం వ్యాపార దుకాణం నిర్వహించే ఒక మహిళను నమ్మించి కిలో బంగారం మోసానికి పాల్పడిన సంఘటన బంజారాహిల్స్ ఠాణా పరిధిలో చోటుచేసుకొంది. బంజారాహి ల్స్ పోలీసుల కథనం ప్రకారం..
మై హోం భూజాలో నివసిం చే పాలకుర్తి లక్ష్మీ కావ్యకు బంజారాహిల్స్ రోడ్ నంబరు 2లో స్వర్ణ కావ్యం పేరుతో బంగారు ఆభరణాల దుకాణం ఉంది. ఆమెకు సామాజిక మాధ్యమం ద్వారా అంకిత్ అలియాస్ శ్రీనాథ్ రాఠీ పేరుతో ఒక వ్యక్తి పరిచయమయ్యాడు. తాను సోషల్ ఎలైట్, ఫిక్కి మాజీ అధ్యక్షురాలైన పింకీరెడ్డి వ్యక్తిగత సహాయకుడినని నమ్మించాడు. తాము చేసే వ్యాపారంలో భాగంగా బంగారు ఆభరణాలు సేకరించి బంగారు బిస్కెట్ రూపంలో ఇస్తామని నమ్మించాడు. దీంతో ఆమె ఈ నెల 19న 136 గ్రాముల ఆభరణాలు తీసుకొని అందుకు ప్రతిగా చెక్కులు ఇచ్చాడు. మరుసటి రోజు ఆమెకు దాదాపు 140 గ్రాముల బంగారు బిస్కెట్‌ను అందజేశాడు. అలా తరువాత అతను సీన్‌లోకి రాకుండానే తన అనుయాయుల ద్వారా 350 గ్రాములు, 550 గ్రాముల బంగారు ఆభరణాలు సేకరిం చి తిరిగి బంగారు బిస్కెట్ అప్పగించాడు. అదే సమయంలో బ్యాంకు నుంచి లోన్లు సైతం ఇప్పిస్తానని, ఆమెకు రూ. 10కో ట్ల మేర రుణం ఇప్పిస్తామని నమ్మించాడు. దీంతో పూర్తిగ నమ్మిన లక్ష్మీ కావ్య అతనికి దాదాపు కేజీ 36 గ్రాములు బంగారు ఆభరణాలను ఈ నెల 23న మాదాపూర్‌లోని కోహి నూర్ హోటల్‌లో అందజేసింది. కాగా ఈ నెల 25న బంజా రాహిల్స్‌లోని లీలా హోటల్‌లో బంగారం అప్పగిస్తానని నమ్మించి తన అనుయాయుడైన కృష్ణతో బంగారు బిస్కెట్ పంపించాడు. బిస్కెట్ బరువు దాదాపు 1800 గ్రాములు ఉండటంతో అనుమానం వచ్చిన లక్ష్మీ కావ్య బిస్కెట్ తీసుకొచ్చిన వ్యక్తిని వేచి ఉండమని చెప్పి జూబ్లీహిల్స్ రోడ్ నంబరు 35లో ఉన్న ఒక బంగారం తనిఖీ దుకాణానికి వెళ్లింది. అక్కడ అది బంగారం పూత పూసిన రాగి బిస్కెట్‌గా గుర్తించడంతో వెంటనే శ్రీనాథ్ రాఠీకి ఫోన్ చేసినా స్పందిచంలేదు. దీంతో అనుమానం వచ్చిన ఆమె బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతోపాటు కృష్ణను పోలీసులకు అప్పగించారు. దాదాపు రూ. 1.5కోట్లకుపైగా విలువైన బంగారు ఆభరణాలను శ్రీనాథ్ రాఠీతోపాటు అతని అనుచరులైన కృష్ణ, మనోజ్, పురుషోతం రాఠీలు మోసం చేసి తస్కరించారని లక్ష్మీ కావ్య ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని నిందితుల కోసం గాలిస్తున్నారు.

# కనులపండువగా స్వామివారి కళ్యాణమహోత్సవం

### అంగరంగవైభవంగా కొనసాగుతున్న శ్రీపాత వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు



స్వామివారి కళ్యాణానికి పట్టువస్త్రాలు తీసుకువస్తున్న హరీష్‌రావు



స్వామివారి కళ్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**
జిల్లా కేంద్రంలోని పారుపల్లి వీధిలోగల శ్రీపాత వేంకటేశ్వరస్వామి ఆలయంలో 56వవార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం ఏకాదశి సందర్భంగా శ్రీభూనీలా సమేత శ్రీవేంకటేశ్వర స్వామివారి కళ్యాణ మహోత్సవం కన్నులపండువగా నిర్వహించారు. స్వామివారి కళ్యాణంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని వీక్షించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం సామూహిక కుంకుమ పూజలు ఘనంగా నిర్వహించారు.

### స్వామివారి కళ్యాణానికి పట్టువస్త్రాలు సమర్పించిన హరీష్‌రావు...

మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామివారికి కళ్యాణానికి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అలాగే జిల్లా కేంద్రంలోని శ్రీమార్కండేయస్వామి దేవాలయంలో ధ్వజ స్తంభ ప్రతిష్ఠా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో శ్రీపాత వేంకటేశ్వర సేవా సమితి ప్రతినిధులు గంప శ్రీనివాస్, డాక్టర్ మాంకాల నవీన్‌కుమార్, పుల్లూరు శివకుమార్, గంప కృష్ణమూర్తి, పుల్లూరు శశాంక్, అర్వపల్లి హరికిరణ్, బిఆర్ఎస్ నాయకులు రాజనర్సు, రాధాకృష్ణశర్మ, ధర్మవరం బ్రహ్మం, ఊదర మణిదీప్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## కడిగిన ముత్యంలా కవితక్క..

**-కుట్రదారులకు చెంపపెట్టులా తీర్పు ఇచ్చిన న్యాయస్థానం**
**-వీరప్పగారి రమేష్‌గౌడ్**

**హవేలీఘనపూర్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:**
తెలంగాణ జాగృతి కవితక్కపై కుట్రదారులకు చెంపదెబ్బ కొట్టినవిధంగా న్యాయస్థానం క్లీన్ చిట్ ఇచ్చిందని మెదక్ జిల్లా నాయకులు రమేష్‌గౌడ్ అన్నారు. శుక్రవారం స్థానిక విలేకరుల సమావేశంలో జాగృతి జిల్లా నాయకుడు వీరప్పగారి రమేష్‌గౌడ్ మాట్లాడుతూ కవితక్కపై పెట్టిన ఢిల్లీ లిక్కర్ కేసు తప్పుడుకేసు అని రౌస్ ఎవెన్యూ కోర్టు తేల్చిచెప్పి కేసులు కొట్టివేయడం సంతోషకరమైన విషయమన్నారు. కేంద్ర ప్రభుత్వం కావాలని రాజకీయంగా దెబ్బకొట్టడం కోసమని ఇలాంటి తప్పుడుకేసులకు పాల్పడిందన్నారు. ఈ కేసులో కవితక్కతో పాటు కేజ్రీవాల్, మనీష్ సిసోడియ అందరికీ క్లీన్ చీట్ వచ్చిందని అన్నారు. రాజకీయంగా సహకరించని వారిపైన ఇలాంటి అక్రమ కేసులు పెట్టడం మానుకోకపోతే ప్రజలే బిజెపికి బుద్ధి చెబుతారని వీరప్పగారి రమేష్‌గౌడ్ అన్నారు. భవిష్యత్తు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కవితక్క అని ఆయన తెలిపారు.

## చిన్నారుల ప్రతిభ అభినందనీయం..

**-జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి**



విద్యార్థులు తయారు చేసిన పరికరాలను పరిశీలిస్తున్న దృశ్యం

**రామాయంపేట, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:**
సైన్స్ పరికరాల తయారీలో చిన్నారుల ప్రతిభ అభినందనీయమని జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం స్థానిక వివేకానంద విద్యాలయంలో ప్రాజెక్టుల ప్రదర్శనను జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా విద్యార్థులు తయారుచేసిన దాదాపు 200కు పైగా ప్రాజెక్టులను చూసిన ఆయన వాటిపై పలుప్రశ్నలు సంధించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిఐ నరేందర్, ఎస్సైలు విజయ్, సిద్ధార్థ, హరీష్‌లు పాల్గొని విద్యార్థులను అభినందించారు. కార్యక్రమానికి విచ్చేసి విద్యార్థులకు అమూల్యమైన సూచనలు చేసిన అతిథులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎ.రాంకుమార్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతంచేసిన సైన్స్ ఉపాధ్యాయులు రాంప్రసాద్, నీరజ, జ్యోతిక తదితర ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు.

## విద్యారంగానికి వెంకటేశం సేవలు చిరస్మరణీయం

**-నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి...**

**పెద్దశంకరంపేట, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:**
విద్యారంగానికి మండలవిద్యాధికారి, బాలికల ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశం అందించిన సేవలు చిరస్మరణీయమని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. ఎంఈఓ వెంకటేశం పదవీవిరమణ సందర్భంగా స్థానిక ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటుచేసిన పదవీవిరమణ సన్మాన సభలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈసందర్భంగా పదవీవిరమణ పొందిన ఎంఈఓ వెంకటేశంను వివిధ ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, బాలికల ఉన్నత పాఠశాల సిబ్బంది, అల్లాదుర్గం సిఐ రేణుకరెడ్డి, పెద్దశంకరంపేట, అల్లాదుర్గం ఎస్ఐలు ప్రవీణ్‌రెడ్డి, శంకర్‌లు పూలమాలలు శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం పదవీవిరమణ పొందిన ఎంఈఓ వెంకటేశం మాట్లాడుతూ తన సేవాకాలంలో సహకరించిన అధికారులు, ఉపాధ్యాయులు, తోటి సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

## మార్చి 1న మహా శాఖాహార ర్యాలీ

**-పోస్టర్‌ను ఆవిష్కరించిన నిర్వాహకులు**



శాకాహార ర్యాలీ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

**జహీరాబాద్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:**
పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ ఆఫ్ ఇండియా జహీరాబాద్ ఆధ్వర్యంలో మార్చి 1వ తారీఖున పట్టణంలో మహా శాఖాహార ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు బ్రహ్మర్షి పత్రీజీ పిరమిడ్ ధ్యాన సొసైటీ నిర్వాహకులు అఖండ జ్ఞాని జ్ఞానేశ్వర్, ధ్యాన ట్రైనర్స్ మీనా, సతీష్‌బాబులు తెలిపారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మీనా, సతీష్‌లు మాట్లాడుతూ మార్చి 1న నిర్వహించే మహా శాఖ ర్యాలీకి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎ. నివాస్‌రావు, బోయిని స్వప్న, పరమేశ్వర్, దత్తు తదితరులు పాల్గొన్నారు.

## నర్సాపూర్ ఆర్డీవోగా రామకృష్ణ

**నర్సాపూర్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:**
నర్సాపూర్ ఆర్డీవోగా రామకృష్ణను నియామకం చేయగా ఆయన ఆర్డిఓగా పదవీబాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఆర్డీవోగా విధులు నిర్వహించిన మహిపాల్‌రెడ్డి సాధారణ బదిలీలలో భాగంగా శేరిలింగంపల్లి అదనపు కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. బదిలీ అయిన మహిపాల్‌రెడ్డి స్థానంలో హైదరాబాద్ సిసిఎల్ఏ నుంచి ఆర్డీవోగా రామకృష్ణ నియామకం అయ్యారు. ఈ మేరకు ఆయన రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో పదవీబాధ్యతలు స్వీకరించారు.

## ఎంపిని కలిసిన కెమిస్ట్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ సభ్యులు



ఎంపి రఘునందన్‌రావును కలిసిన కెమిస్ట్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ సభ్యులు

**నర్సాపూర్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:**
మెదక్ ఎంపి మాధవనేని రఘునందన్‌రావును నర్సాపూర్ తాలూకా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ సభ్యులు హైదరాబాదులోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈమేరకు బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు నర్సాపూర్ మున్సిపల్ వైస్‌చైర్మన్ బుచ్చేష్‌యాదవ్, బిజెపి ఓబిసి రాష్ట్ర ఉపాధ్యక్షులు పాపగారి రమేష్‌గౌడ్‌లతోపాటు తాలూకా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జి.శ్రీనివాస్‌గుప్తా, సెక్రటరీ కె.శ్రీకాంత్, ట్రెజరరీ ఎం.శ్రీనివాస్‌గుప్త, నాగరాజ్‌గుప్తలు కలిశారు. ఈసందర్భంగా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఒక వినతిపత్రాన్ని ఎంపి రఘునందన్‌రావుకు అందజేశారు. ఇందుకు ఎంపి రఘునందన్‌రావు స్పందిస్తూ మీ సమస్యలు ఏమున్నా పరిష్కరించేందుకు తనవంతు కృషిచేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## ఎం బాజా సే ఇండియా బగ్గీల పోటీలు

**-36 జట్ల బగ్గీల టెక్నికల్ ఇన్స్పెక్షన్ పూర్తి**



రెండవ రోజు బగ్గీల వాహనాలకు పరీక్షలు చేస్తున్న దృశ్యం

**నర్సాపూర్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:**
నర్సాపూర్ సమీపంలోని బివిఆర్ఐటిలో మెకానికల్ బాజా సే ఇండియా 2026 రెండవ రోజు వివిధ విభాగాల్లో బగ్గీల శక్తిసామర్థ్య పోటీ పరీక్షలు నిర్వహించారు. అంతేగాక 36 జట్ల టెక్నికల్ ఇన్స్పెక్షన్ విజయవంతంగా పూర్తి చేశామని ఎం బాజా సే ఇండియా కన్వీనర్ అలీ సయ్యద్, జాయింట్ కన్వీనర్ ప్రొఫెసర్ డాక్టర్ వేముల మురళీకృష్ణ తెలిపారు. కార్యక్రమాల్లో బివిఆర్ఐటి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సంజయ్ దూబే, డైరెక్టర్ డాక్టర్ లక్ష్మి ప్రసాద్, బాలాజీ సుబ్రమణ్యం, చెర్మన్, ఆర్గనైజింగ్‌కమిటీ, డాక్టర్ కె.సి.వోరా, బాజా సే ఇండియా సలహాదారు, కళాశాల ఎజిఎం కాంతారావు, మేనేజర్ బాపిరాజు. ఎవోసురేష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామసంఘాల భవన నిర్మాణాలకు నిధులు

**-ఎపిఆర్ మల్లేశం, ఎపిఎం సంగమేశ్వర్**



నూతన భవన నిర్మాణానికి భూమిపూజలు చేస్తున్న ఎపిఆర్ మల్లేశం, ఎపిఎం సంగమేశ్వర్, సర్పంచులు తదితరులు

**నర్సాపూర్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:**
నర్సాపూర్ మండలపరిధిలోని 23 గ్రామాల్లో గ్రామసంఘాల నూతనభవన నిర్మాణాలకు నిధులు మంజూరు అయ్యాయని ఎపి ఆర్.మల్లేశం, ఎపిఎం సంగమేశ్వర్ తెలిపారు. గురువారం నర్సాపూర్ మండలంలోని చిప్పల్‌తుర్తి, లింగాపూర్ గ్రామాల్లో గ్రామసంఘం నూతన భవన నిర్మాణాలకు భూమి పూజలు చేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచులు లింగాపూర్ గ్రామసర్పంచి రాజకళాశ్రీనివాస్‌గుప్తా, చిప్పలుతుర్తి గ్రామసర్పంచి సుధాకర్, ఎపిఆర్ మల్లేశం, గ్రామైక్య సంఘం అధ్యక్షురాలు కరుణ, వినోద, జెండర్ పాయింట్ పర్సన్ చింతల లక్ష్మి, ఎపిఎం సంగమేశ్వర్, సిసిలు నాగరాజు, దేవిసింగ్, వివోఎలు రాధా, రజిత, గ్రామైక్య సంఘం ప్రతినిధులు, గ్రామపెద్దలు, గ్రామ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మైనార్టీ మండల అధ్యక్షుడిగా సలీం

**పెద్దశంకరంపేట, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:**
పెద్దశంకరంపేట మండల మైనార్టీ అధ్యక్షుడిగా సలీం ఎన్నికయ్యారు. శుక్రవారం స్థానిక మోతీషాహీద్ దర్గాలో ఏర్పాటు చేసిన పోలింగ్‌లో ఆయన అధ్యక్షుడిగా విజయం సాధించారు. ఆయనతో పాటు వైస్ ప్రెసిడెంట్‌గా ఎండి.జాకీర్‌రాజా, సెక్రటరీగా ముక్రమ్‌లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారిని స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, మైనార్టీ సభ్యులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. మైనార్టీల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని నూతన అధ్యక్షుడు ఎండి.సలీం పేర్కొన్నారు.

## పౌష్టికాహారం తీసుకోవాలి

**చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:**
చిన్నారులు, గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు తోటవ్వ అన్నారు. శుక్రవారం మండల పరిధి చందాపూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు స్వప్న ఆధ్వర్యంలో గర్భిణీ స్త్రీలకు సీమంతం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్యామల, స్వరూప, గర్భిణీ స్త్రీలు తదితరులు పాల్గొన్నారు.

## మాదిగ జాతి ఐక్యంగా రాజ్యాధికారం కోసం కృషి చేయాలి

**సైఫాబాద్, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:** రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన మాదిగ జాతి హక్కుల కోసం ఏకం కావాలని రాష్ట్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ నాయకుడు మోత్కుపల్లి నరసింహులు పిలుపునిచ్చారు. రాజకీయ పార్టీలకు మాదిగలపైన నమ్మకం లేదని, రాజకీయాలు చేయడం మాదిగలకు చేతకాదని అందుకే వెనుకబడి పోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన మాదిగ హక్కుల దండోరా ఆవిర్భా వ దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేద్కర్ ఇచ్చిన ఓటు హక్కు ద్వారా రాజ్యాధి కారాన్ని సాధించాలని, ఓట్లను డబ్బులకు అమ్ముకోరాదని పిలుపు నిచ్చారు. అసెంబ్లీ, పార్లమెంట్‌లో మాదిగ ప్రజా ప్రతినిధులు అధి కంగా ఉండాల్సిందని, కాని రాష్ట్రం నుంచి ఒక ఎంపి కూడా లేరని ఆవేదన వ్యక్తం చేశారు. విడిపోయిన మాదిగ సంఘాలన్ని ఒకటి కావాలని, ఈ వేదిక ద్వారా కృష్ణమాదిగకు విజ్ఞప్తి చేసున్నానని చెప్పారు. వచ్చే మూడేళ్ళలో మాదిగల బలం చూపిదా ద్దమన్నారు. మాదిగ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు సునీల్ మాట్లాడుతూ 2021లో స్థాపించిన తమ పోరాట సమితి కులాలతో సంబంధం ఎస్సీ,ఎస్టీ,బిసిల హక్కుల సాధన కోసం కృషి చేసిందని చెప్పా రు. ఈ సమావేశంలో ఎస్సీ కార్పోరేషన్ ఛైర్మన్ ప్రీతం, సమితి ప్రధాన కార్యదర్శి రామకృష్ణ,మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు రోజారాణి, ప్రముఖ కవి, వాగ్గేయకారుడు చిలుకా భాస్కర్ పాల్గొన్నారు.

## జిల్లా స్థాయిలో బంగారు రజిత పతకాలు సాధించడం అభినందనీయం : వడ్డేపల్లి

**కూకట్‌పల్లి, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త**
జిల్లాస్థాయిలో బాలనగర్‌కు చెందిన ఆయేషా బంగారు రజిత పథకాలు సాధించడం అభినందనీయమని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు పేర్కొన్నారు. బాలనగర్ డివిజన్ కు చెందిన ఆయేషా ఇటీవల మహబూబ్ నగర్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీల్లో పాల్గొని స్వర్ణ, రజత పతకాలు సాధించి విజేతగా నిలిచింది. తన భవిష్యత్ క్రీడా ప్రస్థానానికి సహాయసహకారాలు అందిస్తున్న బిజెపి రాష్ట్ర కార్య వర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావుని శుక్రవారం ఆమె వారి నివా సంలో కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు ఆయేషాను అభినందిస్తూ క్రీడల్లో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కృషి, పట్టుదల, నియమం ఉంటే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కూడా విజయం సాధించ గలవని ప్రోత్సహించారు. భవిష్యత్తులో ఆమెకు అవసరమైన సహా యం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు సురేందర్ రెడ్డి, రమేష్, శివరంజని, రూప, మధు, పప్యం శ్రీనివాస్, ప్రదీప్ రెడ్డి, అనిల్ ఆయేషా కుటుంబ సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

### వీరాంజనేయ స్వామి దేవస్థానం ధర్మకర్తలి సభ్యులకు సన్మానం

**సికింద్రాబాద్, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:**
సీతాఫల్‌మండి నామాలగుండులోని శ్రీవీరాంజనేయ స్వామి దేవ స్థానం ధర్మకర్తల అభినంద సభ శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సికింద్రాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఆదం సంతోష్ కుమార్ హాజరై శుభా కాంక్షలు తెలిపారు. వేద పండితుల సమక్షంలో చైర్మన్ కాచం రాము, ధర్మకర్తల మండలి సభ్యులుగా మున్నూరు చందు, కైలాస్ అరుణ్ కుమార్, నరేష్, ప్రవీణ్, ప్రతాప్, శ్యామల రమణి తదిత రులు పదవి బాధ్యతలను స్వీకరించారు. కార్యక్రమంలో నోముల ప్రకాష్‌రావు, కుంచాల ఏడుకొండలు, మాదిరెడ్డి జలంధర్ రెడ్డి, మహేందర్, అనిల్, కరాటే రాజు తదితరులు పాల్గొన్నారు.

### హరిహర పుత్ర అయ్యప్పస్వామి దేవాలయంలో 108 కలశాలతో స్వరాభిషేకం

**యూసుఫ్‌గూడ, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త :**
బోరబండ ఎన్ఆర్ఆర్ పురం సైట్2లోని మల్లన్న స్వామి ప్రాంగణంలో హరిహరపుత్ర అయ్యప్పస్వామి దేవాలయం 18వ వార్షికోత్సవ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. శుక్రవారం ఉదయం శుప్రభాత సేవ, శ్రీలక్ష్మీగణపతి హోమం, 108 కలశాలతో స్వరాభిషేకం, మధ్యాహ్నం భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం సాయంత్రం దీపారాధన, పడిపూజ మహోత్సవం, శ్రీ సాయి మణికంఠ భజనా మండలి వారిచే భజనా కార్యక్రమం, పడి ప్రజ్వలన, నీరాజనం, మంత్రపుష్పం, హరిహోరసనం, అనంతరం భక్తులకు అల్పాహారాన్ని ఏర్పాటు చేశారు. ఆలయ చైర్మన్ లక్ష్మణ్ గౌడ్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు ఘనంగా ముగిశాయి. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బాలకృష్ణ, కాశీరావు, విజయ్, సత్యనారాయణ, సోమేష్, గోవింద్, సంజీవ, శ్రీను, మధు, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## పవిత్ర రంజాన్ మాసంలో సహేరీ

**యూసుఫ్‌గూడ, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త :**
ప్రవిత్ర రంజాన్ మాసంలో ఎంతో భక్తి శ్రద్ధలతో బోర బండ ఎన్ఆర్ఆర్ పురం సైట్1 కాలనీలో గ్రేటర్ మా జీ ఉప మేయర్ బాబా ఫసి యుద్దీన్ ఆధ్వర్యంలో శుక్రవారం తెల్లవారుజాము న సహేరీ నిర్వహించారు. రంజాన్ పండుగను పురస్కరించుకుని గత 11 సవంత్సరాలుగా సహేరీ నిర్వహిస్తూ వస్తున్నారని 9వ రోజు కూడా ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

## ఎన్‌సిఈఆర్‌టి చర్యలు ఖండిస్తున్నాం

**తెలంగాణ అడ్వకేట్ జెఏసి కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి**

**ముషీరాబాద్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** న్యాయవ్యవస్థలో అవినీతిపై ఎనిమిదవ తరగతి పాఠ్యపుస్తకంలో చేర్చిన ఎన్.సి. ఈ.ఆర్.టి ఆత్మ పరిశీలన చేసుకోకపోగా, ఆయా అంశాలను సమర్థించటం వంటి చర్యలను తెలంగాణ న్యాయవాదులుగా ఖండిస్తున్నామని తెలంగాణ అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన కవాడిగూడ లో విలేఖరులతో మాట్లాడుతూ యువత మనసులపై తీవ్ర ప్రభావం చూపే విధంగా పాఠ్యపుస్తకాలలో చేర్చి, సుప్రీంకోర్టు న్యాయవ్యవస్థ అధికారాన్ని,గౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఎన్ సీఈఆర్‌టి డైరెక్టర్ నిర్లక్ష్యంగా వివరణ ఇవ్వటం సరికాదన్నారు.యువకుల మనోభావాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దే వి ధంగా పాఠాలు ఉండాలి కానీ, వ్యవస్థపై యువత మనసుల లో విషబీజాలు నాటడం ఆక్షేపణీయం అన్నారు. పాఠ్య పుస్త కంలో ఉన్న దిరోల్ ఆఫ్ జ్యుడిషియరీ ఇన్ అవర్ సొసైటీ, యాజ్ ఏ గ్రేవ్ మ్యాటర్ అనే పేరుతో ఉన్న పాఠ్యాంశాన్ని సమగ్రంగా నిషేధించాలని సుప్రీంకోర్టు నిర్ణయించటం అభినందనీయమన్నారు.న్యాయవ్యవస్థ ప్రతిష్టను కించపరిచే విధంగా ఉన్న పాఠాన్ని ముద్రించటానికి బాధ్యులైన వారిని, ఎన్‌సీఈఆర్‌టి డైరెక్టర్‌ను, సంబంధిత అధికారులను ప్రజల ముందుంచాలన్నారు.

### కవిత చిత్రపటానికి జాగృతి నేతల పాలాభిషేకం

**చాంద్రాయణగుట్ట, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త :**
ఢిల్లీ లిక్కర్ స్కాం లో కల్వకుంట్ల కవి తతోపాటు మరో 23 మందిని నిర్దో షులుగా పేర్కొంటూ రౌస్ ఎవెన్యూ కోర్టు క్లీన్ చీట్ ఇ వ్వటాన్ని తెలంగా ణ జాగృతి నేతలు స్వాగతించారు. చార్మినార్ సమీపంలో కవి త చిత్రపటానికి పాలాభిషేకంచేశారు. కవితకు అనుకూలంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ జాగృతి చార్మి నార్ ఇంచార్జ్ పి.రాధాకృష్ణ మాట్లాడుతూ బీజేపీ, సీబీఐని గుప్పిట్లో పెట్టుకొని బ్లాక్ మెయిల్ రాజకీయాలు చేసిందని ఆరోపించారు. కార్యక్రమంలో వెంకట్, విజయ కుమార్, బాను, ప్రియాంక, లక్ష్మి, నవనీత పాల్గొన్నారు.

## మణికొండలో మంచినీటి సమస్య లేకుండా పనిచేశారు : వంశీ

**నార్సింగి, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త :** జల మండలి జిఎం శ్రీనివాస్‌రెడ్డి పదవీ విమరణ పొందారు. ఈ సందర్భంగా మణికొండ ఆల్ కాలనీస్ ఫెడ్రేషన్ అధ్యక్షులు అర్వపల్లి వంశీ, వివిధ కాలనీల ప్రతినిధుల బృందం శ్రీనివాస్‌రెడ్డికి పుష్పగు చ్ఛాలిచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వంశీ మాట్లాడుతూ మణికొండలో మంచినీటి ఇబ్బందులు తలెత్తకుం డా అంకిత భావంతో శ్రీనివాస్‌రెడ్డి విధులు నిర్వహించారని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులకు పదోన్నతులు, పదవీ విర మణలు సాధారణమన్నారు. శ్రీనివాస్‌రెడ్డికి పుష్ప గుచ్ఛాలిచ్చిన వారిలో ప్రతినిధులు ఆంజనేయులు, రవీందర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రాజురెడ్డి, బాబురావ్, కృష్ణకుమార్, శంకర్‌దేవ్, అవినాష్, శ్రీనివాస్‌రెడ్డి, రామయ్య, కిషన్ తదితరులు ఉన్నారు.



నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న రజక సంఘం నాయకులు

## చిన్నారిపై దాడిచేసిన దోషులను కఠినంగా శిక్షించాలి

### రజక సంఘం జిల్లా అధ్యక్షుడు జంగాపల్లి ఐలయ్య

**హుస్నాబాద్ రూరల్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త :** పట్టణంలో శుక్రవారం రజక సంఘం ఆధ్వర్యంలో చిన్నారి మౌనికపై జరిగిన దాడిని ఖండిస్తూ భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. బాధిత చిన్నారికి న్యాయం చేయాలని, దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రజక సంఘం జిల్లా అధ్యక్షుడు జంగాపల్లి ఐలయ్య డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో సంఘం నాయకులు సారయ్య మేకల వీరన్నయాదవ్, పిడిశెట్టి రాజు, సమ్మయ్య, రజక యూత్ అధ్యక్షుడు రవీందర్, ప్రధాన కార్యదర్శి రమేష్ (కపిల్), నాయకులు రాజు, రమేష్(డిష్), రాజేష్, చందు, నాగరాజు, అంజి, రమేష్, సురేష్, అజయ్, రాకేష్, శంకర్, నాగారం ఉపసర్పంచ్ తిరుపతి, నాగారం రజక అధ్యక్షులు సంగ సంపత్, గాంధీనగర్ రజక అధ్యక్షులు నంగునూరి సంపత్, తోటపల్లి రజక అధ్యక్షులు కొలిపాక మొగిలి హాజరయ్యారు.

## వార్డు సభ్యులకు శిక్షణా సర్టిఫికెట్లు ప్రదానం



శిక్షణ పూర్తి చేసిన వార్డు సభ్యులకు సర్టిఫికెట్లు అందిచిన దృశ్యం

**హుస్నాబాద్ రూరల్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త :** గ్రామ పంచాయతీకి నూతనంగా ఎన్నికైన వార్డు సభ్యులకు నిర్వహించిన ఐదు రోజుల శిక్షణా కార్యక్రమం శుక్రవారంతో విజయవంతంగా పూర్తైంది. శిక్షణ పూర్తిచేసిన సభ్యులకు ఎంపీడీవో రమేష్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రమేష్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధిలో వార్డు సభ్యుల పాత్ర కీలకమని, శిక్షణలో నేర్చుకున్న అంశాలను గ్రామాల అభివృద్ధికి వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షులు పోలు సంపత్, ఎంపీవో  జీ. మోహన్, కార్యాలయ పర్యవేక్షకులు శంకరయ్య, టిపోటిఎస్‌లు వేణుమాధవ్, రవి, రాజు, శ్రీనివాస్‌లతో పాటు ఎనిమిది గ్రామ పంచాయతీల వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యేను కలిసిన భూక్య కృష్ణనాయక్



సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడిని సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే

**హుస్నాబాద్ రూరల్/ అక్కన్నపేట, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త**

అక్కన్నపేట మండలం మైసమ్మవాగు తండా సర్పంచ్ భూక్య కృష్ణ నాయక్ సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన సందర్భంగా మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్‌ను శుక్రవారం హన్మకొండలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా సతీష్ కుమార్ భూక్య కృష్ణ నాయక్‌ను శాలువాతో సత్కరించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల సర్పంచ్‌లను సమన్వయం చేసుకుంటూ గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. భూక్య కృష్ణ నాయక్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి మండల అధ్యక్షుడిగా ఎన్నుకున్న సర్పంచ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ భేటీలో పలువురు నాయకులు, అనుచరులు పాల్గొన్నారు.

## సనాతన ధర్మ రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



మాట్లాడుతున్న స్వామిజీ

**కొమురవెల్లి, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త :** సనాతన ధర్మ రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని సద్గురు మహాదేవ్ స్వామిజీ అన్నారు. ఆది జగద్గురు రేణుకాచార్య జయంతి సందర్భంగా కర్ణాటక, మహారాష్ట్ర నుంచి తెలంగాణలోని వివిధ గ్రామాల నుంచి వెయ్యి మందితో ప్రారంభమైన మహా పాదయాత్ర శుక్రవారం కొమురవెల్లికి చేరుకుంది. పాదయాత్రగా వచ్చిన భక్తులు శ్రీమల్లికార్జునస్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం టిటిడి కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ధర్మసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. యాదాద్రి భువనగిరి జిల్లా కొలనుపాక క్షేత్రంలోని ఆది జగద్గురువులు రేణుకాచార్య జయంతిని పురస్కరించుకొని మహాపాదయాత్ర చేపట్టినట్లు తెలిపారు. రేణుకచార్యులు కొలనుపాకలోని అన్ని కులాలకు చెందిన 18 మఠాలను స్థాపించారని తెలిపారు. గోసంరక్షణకు అందరు నడుము బిగించాలని తెలిపారు. అనంతరం మహాదేవ్ స్వామిజీని వీరశైవ లింగాయత్ సభ్యులు, అర్చకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వీరశైవ లింగాయత్ జిల్లా అధ్య క్షుడు మహాదేవుని శ్రీనివాస్, మల్లికార్జునస్వామి ఆలయ స్థానాచార్యులు పడిగన్నగారి మల్లయ్య, ప్రధాన అర్చకులు మహాదేవుని మల్లికార్జున్, అర్చక సంఘం అధ్యక్షుడు పడిగన్న గారి అంజనేయులు, లింగబలిజ సమాజం సభ్యులు పాల్గొన్నారు.

## కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

**ధూళిమిట్ట, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు, నాయకులు, పాల్గొన్నారు.

## ఇంటిపన్నులో వెసులుబాటు కల్పించాలి

### -బిఆర్ఎస్ యువ నాయకుడు ఎన్‌సి.సంతోష్

**గజ్వేల్, ఫిబ్రవరి 27 (ప్రభాతవార్త):** ఆర్ అండ్ ఆర్ కాలనీ సమస్యలపై పార్టీలకతీతంగా న్యాయం చేయాలని బిఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు ఎన్‌సి.సంతోష్ పేర్కొన్నారు. శుక్రవారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కార్యాలయంలో ఆర్ అండ్ ఆర్ కాలనీ సమస్యలపై వినతిపత్రం అందించారు. అనంతరం ఎన్‌సి.సంతోష్ స్థానిక మాట్లాడుతూ ఆర్ అండ్ ఆర్ కాలనీవాసుల సమస్యల పరిష్కారానికి పార్టీలకు అతీతంగా పనిచేయాలని పేర్కొన్నారు. ఆర్‌అండ్‌ఆర్ కాలనీ వాసులు ఇంటిపన్ను ఆరు సంవత్సరాల నుంచి కట్టాలని మున్సిపల్ అధికారులు వత్తిడితెస్తున్నారని, అయితే కాలనీ వాసులకు మున్సిపల్ ద్వారా ఎలాంటి అభివృద్ధి జరగలేదని, అలాంటిది వారు ఇంటిపన్ను ఎలా కడతారని ప్రశ్నించారు. ఇంటిపన్ను కట్టాలని అడగడం భావ్యంకాదని, 2026 జనవరి నుండి మున్సిపల్‌లో విలీనం అయినప్పటి నుండి ఇంటిపన్ను తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇంటిని, ఊరును, వ్యవసాయ భూమిని సర్వస్వం వదులుకొని గజ్వేల్‌కు వచ్చారని, ఇంటిపన్ను విషయంలో ఉపశమనం కలిగించాలన్నారు. ఆయన వెంట ప్రజలు, ఆర్‌అండ్‌ఆర్ కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎన్‌సి.సంతోష్

# బిఆర్ఎస్ పాలనలో రెవెన్యూ వ్యవస్థ గుర్తుకు రాలేదా?

### కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు



మాట్లాడుతున్న అత్తు

**సిద్దిపేట రూరల్, ఫిబ్రవరి 27,ప్రభాతవార్త :** పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావుకు రెవెన్యూ వ్యవస్థ గుర్తుకు రాలేదా అని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎం.డి.ఇమామ్(అత్తు) ప్రశ్నించారు. పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ, పదేండ్ల కాలంలో ఆకస్మిక తనిఖీలు ఎందుకు చేయలేదన్నారు. పదేళ్లలో ఖజానాను కొల్లగొట్టిందే కాకుండా విలువైన భూములను అమ్ముకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ధరణి అక్రమాలను సరిచేసి భూభారతి అమలుచేస్తుందని చెప్పారు. సాదా బైనామా దరఖాస్తులు బిఆర్ఎస్ హయాంలోనే పెండింగ్‌లో పెట్టారని మండిపడ్డారు. సిద్దిపేట పట్టణంలోని 1340, 1668 సర్వే నంబర్లలో ఇద్దరు బిఆర్ఎస్ నాయకులు భూములను కబ్జాచేశారని ఆరోపించారు. భూ భారతి అమల్లోకి వచ్చిన నాటి నుంచి రైతుల, ప్రజల భూములకు రక్షణ లభించిందన్నారు. కాంగ్రెస్ సర్కారు ఇచ్చిన హామీలను అమలుచేస్తూ పేదలను ఆదుకుంటుంటే బిఆర్ఎస్‌నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారని తెలిపారు. కాంగ్రెస్ సర్కార్‌పై సిఎం రేవంత్‌రెడ్డిపై అర్థం పర్థం లేకుండా ఆరోపణలు చేస్తే సహించేది లేదన్నారు. సిద్దిపేటలో కబ్జా అయిన భూములపై దమ్మంటే విచారణకు హరీష్ రావు ఆదేశించి ఆయన నిజాయితీని నిరూపించుకోవాలన్నారు. సమావేశంలో నాయకులు గయాజుద్దీన్, హర్షదహుస్సేన్, విజయ డానియల్, నజ్జు బాబా, రాజు. సంతోష్‌గౌడ్, ఇంద్ర పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డిని సన్మానిస్తున్న ఎల్ల వెంకటేష్

## ఎమ్మెల్సీ యాదవరెడ్డికి సన్మానం

**గజ్వేల్, ఫిబ్రవరి 27 (ప్రభాతవార్త):** ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డితో పాటు గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ గంగిశెట్టి చందన రవీందర్, వైస్ చైర్మన్ కళ్యాణ్‌కార్ పద్మాబాయి నర్సింగరావు, 5వ వార్డు కౌన్సిలర్ మన్నె రూప వెంకటేష్‌లను శుక్రవారం మాజీ ఆత్మ కమిటీ డైరెక్టర్ ఎల్ల వెంకటేష్ దంపతులు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎల్ల వెంకటేష్ మాట్లాడుతూ ప్రజ్ఞాపూర్‌లోని త్రిశక్తి ఆలయవార్షికోత్సవంలో భాగంగా జరుగుతున్న బోనాల ఉత్సవానికి ఎమ్మెల్సీ యాదవరెడ్డి హాజరైన సందర్భంగా వారిని సన్మానించడం జరిగిందని తెలిపారు.

## రామలింగేశ్వర స్వామి దేవస్థానం హుండీ లెక్కింపు

**ధూళిమిట్ట, ఫిబ్రవరి 27,ప్రభాతవార్త:** మండలంలోని బెక్కల్ శ్రీరామలింగేశ్వర స్వామి దేవస్థానం హుండీ లెక్కింపు శుక్రవారం నిర్వహించారు. ఈనెల 1వ తేదీ నుండి నిర్వహించిన బ్రహ్మోత్సవాలలో భాగంగా టికెట్ల అమ్మకం, కళ్యాణ కట్నాలు, హుండీ ఆదాయం మొత్తం కలిపి రూ.1,21,961 వచ్చినట్లు ఈఓ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఇన్స్పెక్టర్ పి. విజయలక్ష్మి  ్మ, జూనియర్ అసిస్టెంట్ శ్రీకాంత్ రెడ్డి,పోలీస్ శాఖ, సిద్దిపేట సేవా సమితి సభ్యులు, కార్యదర్శి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత

### ట్రాఫిక్ సిఐ మురళి

**గజ్వేల్ టౌన్, ఫిబ్రవరి 27 (ప్రభాతవార్త):** రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, చిన్న జాగ్రత్త ప్రాణాలను కాపాడగలదని గజ్వేల్ ట్రాఫిక్ సిఐ మురళి పేర్కొన్నారు. శుక్రవారం గజ్వేల్ పట్టణంలోని బిఎంఆర్ డిగ్రీ కళాశాలలో విద్యార్థిని, విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ మురళి మాట్లాడుతూ మానవ తప్పిదం వల్లే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని అన్నారు. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడిపితే ఎలాంటి ప్రమాదాలు జరగవని తెలిపారు. ప్రమాదరహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో గజ్వేల్ ఎస్ఐ ప్రేమ్‌దీప్, ట్రాఫిక్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతలో కంటిచూపు అత్యంత కీలకం

### -గజ్వేల్ ఏసిపి నర్సింలు

**గజ్వేల్ టౌన్, ఫిబ్రవరి 27 (ప్రభాతవార్త):** రోడ్డు భద్రతలో కంటిచూపు అత్యంత కీలకమని, ముఖ్యంగా హెవీ వాహన డ్రైవర్లు తమ కంటి ఆరోగ్యాన్ని నిరంతరం పరీక్షించుకోవాలని గజ్వేల్ ఏసిపి నర్సింలు తెలిపారు. శుక్రవారం గజ్వేల్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ ఆదేశాల మేరకు ఏసిపి నర్సింలు ఆధ్వర్యంలో వాహనాల డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్ష శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బస్సు, లారీ, ఆటో, గూడ్స్ వాహనాల డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కంటి అద్దాలను ఉచితంగా అందజేసినట్లు తెలిపారు. అనంతరం ఏసిపి నర్సింలు మాట్లాడుతూ డ్రైవర్లు ఆరోగ్యంగా ఉంటేనే రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. ఇటువంటి శిబిరాలు భవిష్యత్తులో కూడా నిర్వహించేందుకు పోలీసు శాఖ కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ పట్టణ సిఐ రవికుమార్, ట్రాఫిక్ సిఐ మురళి, ఎస్ఐ ప్రేమ్‌కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం



ఉచిత టైలరింగ్ శిక్షణలో పాల్గొన్న మహిళలు, తదితరులు

## ఉచిత టైలరింగ్ శిక్షణ ప్రారంభం

**కొమురవెల్లి, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త :** మండల పరిధిలోని పోసాన్‌పల్లిలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కొనసాగుతున్న రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ శిక్షణ కేంద్రంలో భాగంగా శుక్రవారం గంగపుత్ర సంఘం భవనంలో ఉచిత టైలరింగ్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామీణ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. నెల రోజుల పాటు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. శిక్షణకు వచ్చే అభ్యర్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని ఉపాధి దిశగా ముందడుగ వేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఈటిఐ డైరెక్టర్ గేమ్ నాయక్, కో-డైరెక్టర్ రేణుక, ఎంపివో శ్రీనివాస్‌శర్మ, ఎపిఎం చంద్రం, సర్పంచ్, ఉప సర్పంచ్,పాలకవర్గం సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, గ్రామ మహిళలు పాల్గొన్నారు.

## అడవిని తలపిస్తున్న రామవరం పల్లె ప్రకృతి వనం

### సంరక్షణ లేక ఎండిపోతున్న చెట్లు



అడవిని తలపిస్తున్న పల్లెప్రకృతి వనం

**అక్కన్నపేట, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త :** మండలంలోని రామవరం గ్రామంలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనం ప్రస్తుతం నిర్లక్ష్యానికి గురై అడవిని తలపించేలా మారింది. ఒకప్పుడు గ్రామ ప్రజలకు విశ్రాంతి, పర్యావరణ పరిరక్షణకు ఉపయోగపడాల్సిన ఈ వనం ఇప్పుడు పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతో అస్తవ్యస్తంగా మారినట్లు కనిపిస్తోంది. వనంలో నాటిన చెట్లకు సరైన విధంగా నీరు అందకపోవడంతో అనేక మొక్కలు ఎండిపోతున్నాయి. చుట్టూ ఎక్కడ చూసినా పొదలు, పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతో వనం రూపురేఖలు మారిపోయాయి. చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన ఆట పరికరాలు కూడా సంరక్షణ లేక నిరుపయోగంగా మారుతున్నాయి. గ్రామ ప్రజలు చెబుతున్నదేమిటంటే, ఈ పల్లె ప్రకృతి వర్ణం గ్రామానికి దాదాపు మూడు కిలోమీటర్ల దూరం ఉండడంతో సంబంధిత అధికారులు మరియు గ్రామపంచాయతీ అధికారులు వనాన్ని పట్టించుకోకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని అంటున్నారు. వెంటనే శుభ్రపరిచే పనులు చేపట్టి చెట్లకు నీరు అందించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. పల్లె ప్రకృతి వనం లక్ష్యానికి అనుగుణంగా ఉండేలా సంరక్షణ చర్యలు తీసుకుంటేనే గ్రామానికి ఉపయోగపడుతుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

## నత్తనడకన బిటి రోడ్డు పనులు.. ఇబ్బందుల్లో ప్రజలు

**అక్కన్నపేట, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త :** మండలంలోని అంబానాయక్ తండా గ్రామపంచాయతీ పరిధిలో పంచరాయి తండా నుంచి వయ అంబానాయక్ తండా, డిక్యానాయక్ తండా మీదుగా నిర్మిస్తున్న బీటీ రోడ్డు పనులు నత్తనడకన సాగుతున్నాయి. ప్రస్తుతం రోడ్డుపై కంకర మాత్రమే వేసి వదిలేయడంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు పూర్తిగా సిద్ధం కాకపోవడంతో ప్రయాణం కష్టంగా మారిందని స్థానిక గిరిజనులు చెబుతున్నారు. ద్విచక్ర వాహనాలు వెళ్లేటప్పుడు జారి పడే ప్రమాదం ఉందని, వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా మారుతుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పని ప్రారంభించి చాలా రోజులైనా బీటీ రోడ్డు పూర్తి చేయకపోవడంతో ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు మరియు కాంట్రాక్టర్ వెంటనే పనులు పూర్తి చేసి రోడ్డు సరిగా అందుబాటులోకి తీసుకురావాలని గిరిజనులు కోరుతున్నారు.



నత్తనడకన సాగుతున్న బీటీరోడ్డు పనులు

# వైభవంగా శ్రీసీతారామచంద్రస్వామి రథోత్సవం

**మర్కుక్, ఫిబ్రవరి 27 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని పాములపర్తి గ్రామంలో శ్రీసీతారామ చంద్రస్వామి దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీసీతారామచంద్రస్వామి పుష్ప రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. గ్రామ పుర వీధుల్లో డప్పుచప్పుళ్ల మధ్య ఘనంగా ఊరేగించారు. పిల్లలు, పెద్దలు నృత్యాలు చేస్తూ జై శ్రీరామ్ అంటూ నినాదాలుచేస్తూ అందరిని ఆకట్టుకున్నారు. ఊరేగింపు మధ్యలో దండకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపకులు హనుమంతరావు మాట్లాడుతూ శ్రీసీతారామచంద్ర స్వామి 20వ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామివారి పుష్పరథోత్సవం వైభవంగా నిర్వహించడం జరిగిందని తెలిపారు. రథోత్సవంలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు అన్వేష్ త్రిపాఠి, పండితులు దేశాయి కార్తిక్‌శర్మ, మాజీ ఎంపిపి పాండుగౌడ్, బిఆర్ఎస్ బిసిసెల్ మండల అధ్యక్షుడు మ్యాకల కనకయ్య, సర్పంచ్ భవాని బాలకిషన్, ఉపసర్పంచ్ జుట్టు సుధాకర్, శ్యాంసుందర్‌రావు, చకిలం పుండరీకం, బెల్దె కృష్ణమూర్తి, బేతి వెంకట్‌రెడ్డి, కిష్టారెడ్డి, నరేందర్‌రెడ్డి, మల్లారెడ్డి, తండ శ్రీనివాస్, సాదుల్లగౌడ్, అశోక్, నాగేందర్, తలకొక్కుల రాములు, బెల్దె వెంకటేష్, శేఖర్, రమేష్, బచ్చు అంజనేయులు, ఉప్పరి నర్సింగరావు, రవి, వెంకటేష్‌గౌడ్, సోమ వెంకటేష్, ఏడెల్లి మల్లేశం, తలకొక్కుల ప్రభాకర్, చిన్నబోయిన మల్లేశం, చెక్కల స్వామి, రాజు, ముమ్మడి దొడ్డ చారి, లక్ష్మణ్, కరుణాకర్, మురళి పాల్గొన్నారు.



పాములపర్తిలో శ్రీసీతారామచంద్రస్వామి పుష్పరథోత్సవ దృశ్యం

### పల్లె ప్రకృతి వనాల్లో మద్యం తిగితే

## కఠిన చర్యలు తప్పవు: ఎక్సైజ్ సిఐ పవన్‌కుమార్‌రెడ్డి

**హుస్నాబాద్ రూరల్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త :** పల్లె ప్రకృతి వనాలు ప్రజల విశ్రాంతి, ఆరోగ్య పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన ప్రజా స్థలాలని, అక్కడ మద్యం తాగడం చట్ట విరుద్ధమని ఎక్సైజ్ సీఐ పవన్ కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం 'ప్రభాతవార్త'లో 'మందుబాబులకు అడ్డాలుగా మారిన పల్లెప్రకృతి వనాలు' శీర్షికతో వార్త ప్రచురితం కాగా ఆయన వెంటనే స్పందించారు. ఇటీవల కొన్ని గ్రామాల్లో పల్లె ప్రకృతి వనాల్లో మద్యం తాగుతున్న ఘటనలు వెలుగులోకి వస్తుండడంతో ఎక్సైజ్ శాఖ అప్రమత్తమైందని తెలిపారు. ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజా స్థలాల్లో మద్యం తాగడం వల్ల సామాజిక సమస్యలు తలెత్తే అవకాశముందని పేర్కొంటూ, గ్రామస్తులు కూడా ఇలాంటి ఘటనలు గమనించిన వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. పల్లెప్రకృతి వనాలను పరిశుభ్రంగా, సురక్షితంగా ఉంచడం అందరి బాధ్యత అని సీఐ పవన్ కుమార్ రెడ్డి వివరించారు.

## మహ్మదాపూర్‌లో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

**హుస్నాబాద్ టౌన్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త :** హుస్నాబాద్ మండలం మహ్మదాపూర్ రైతువేదికలో గురువారం ప్రకృతి వ్యవసాయం, ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వరి, మొక్కజొన్న పంటల యాజమాన్య పద్ధతులపై రైతులకు  అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన కే.వి.కె శాస్త్రవేత్త శ్రీనివాస్ మాట్లాడుతూ న్యాచురల్ ఫార్మింగ్‌లో భాగంగా జీవామృతం తయారీ విధానం, దాని వినియోగం, అలాగే ఘన జీవామృతం తయారీ, వాడే పద్ధతులపై సమగ్రంగా వివరించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా తక్కువ ఖర్చుతో మెరుగైన ఫలితాలు సాధించవచ్చన్నారు. అనంతరం హుస్నాబాద్ డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్ జంగపెల్లి ఐలయ్య మాట్లాడుతూ న్యాచురల్ ఫార్మింగ్ ద్వారా పంట దిగుబడిలో ఎలాంటి తగ్గుదల లేకుండానే ఆరోగ్యకరమైన పంటలు పొందవచ్చన్నారు. రైతులు రసాయనాలపై ఆధారపడకుండా సేంద్రియ విధానాలను అవలంబించాలని సూచించారు. కార్యక్రమంలో ఏడిఏ వీణారెడ్డి,  మహ్మదాపూర్ గ్రామ సర్పంచ్ జిల్లెల తిరుమలతిరుపతి రెడ్డి, ఉప సర్పంచ్ కత్తుల సమ్మరాజు, రాములపల్లి ఉప సర్పంచ్ మధుసూదన్, మండల వ్యవసాయ అధికారి పూజ, ఆత్మ బిటిఎమ్ శ్రీనివాస్, ఏఈవో స్వామి, ఆత్మ  ఏటిఎమ్ మౌనికతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## సహజ పద్ధతుల్లో పంటలు సాగు చేయాలి

### ఆత్మ బ్లాక్ టెక్నాలజీ మేనేజర్ దిలీప్‌కుమార్

**ములుగు, ఫిబ్రవరి 27 (ప్రభాతవార్త):** రైతులు సహజ పద్ధతుల్లో పంటలను సాగుచేసి తక్కువ ఖర్చుతో అధిక లాభాలు సాధించాలని ఆత్మ బ్లాక్ టెక్నాలజీ మేనేజర్ దిలీప్‌కుమార్ సూచించారు. శుక్రవారం కొక్కొండ గ్రామంలో రైతులకు సహజ వ్యవసాయంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దిలీప్‌కుమార్ మాట్లాడుతూ జీవామృతం, ఘన జీవామృతం తయారీ విధానం, బీజామృతం ద్వారా విత్తన శుద్ధి, సహజ కీటకనాశక ద్రవణాల తయారీ, మిశ్రిత పంటలు మరియు అంతర పంటల సాగు విధానాలపై వివరించారు. నేల ఆరోగ్యంగా ఉండాలంటే సహజ వ్యవసాయం చేయాలని, రైతులు ఎరువులు, పురుగుమందులపై ఆధారపడకుండా తక్కువ వ్యయంతో ఆరోగ్యకరమైన పంటలను సహజ వ్యవసాయం ద్వారా పండించగలరని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి నివేదిత, ఏటిఎం క్రాంతి, రైతులు పాల్గొన్నారు.

## ఈవేస్ట్ నిర్వహణపై శిక్షణా శిబిరం

**హుస్నాబాద్ రూరల్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** హుస్నాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఈవేస్ట్ నిర్వహణపై ఒకరోజు శిక్షణా శిబిరం నిర్వహించారు. కళాశాల కెరీర్ గైడెన్స్ సెల్, తెలంగాణ అకాడమీ స్కిల్ అండ్ నాలెడ్జ్(టిఎఎస్‌కె) సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటుచేయడం జరిగిందని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ విజయగిరి బిక్షపతి తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో పర్యావరణ అవగాహన పెంపొందించడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని చెప్పారు. టాస్క్ నుండి సాంకేతిక శిక్షకుడు హేమంత్‌కుమార్ ఈవేస్ట్ వల్ల కలిగే నష్టాలు, పర్యావరణంపై ప్రభావం, సరైన నిర్వహణ  పునర్వినియోగ పద్ధతులపై వివరించారు. ఎలక్ట్రానిక్ పరికరాలు పాడైపోయినప్పుడు వాటిని నిరక్ష   ్యంగా పార వేయకుండా శాస్త్రీయ విధానంలో నిర్వహించాల్సిన అవసరం ఉందని తెలి పారు. ఇంచార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ అనిల్ కుమార్ విద్యార్థులు బాధ్యతతో ఈవేస్ట్‌ను రీసైకిల్‌చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సమన్వయకర్త ఆర్.కుమారస్వామి, విద్యార్థులు ఉన్నారు.

## కవితపై అక్రమ కేసుకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు

### -జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షులు కొట్టాల యాదగిరి

**గజ్వేల్, ఫిబ్రవరి 27 (ప్రభాతవార్త):** లిక్కర్ కేసులో జాగృతి వ్యవస్థాపకురాలు, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కడిగిన ముత్యంలా బయటపడిందని తెలంగాణ రాష్ట్ర జాగృతి ఉపాధ్యక్షులు కొట్టాల యాదగిరి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఢిల్లీలోని రౌస్ ఎవెన్యూ కోర్టు కవితను నిర్దోషిగా ప్రకటించగా, ఆమెపై సిబిఐ మోపిన అభియోగాలన్నింటినీ కొట్టివేసినట్లు తెలిపారు. సిబిఐ ప్రత్యేక కోర్టు జడ్జి జితేందర్ సింగ్ ఇచ్చిన తీర్పుతో ప్రజలకు చట్టాలు, కోర్టులపై మరింత నమ్మకం పెరిగిందన్నారు. కవితకు కోర్టు క్లీన్‌చిట్ ఇవ్వడంతో ఎలాంటి సాక్ష్యాధారాలు లేకుండా సిబిఐ అక్రమంగా లిక్కర్ కేసు నమోదు చేసినట్లు అర్థమవుతుందన్నారు. సిబిఐ వంటి రాజ్యాంగ సంస్థ వత్తిడిలతో కవితపై అక్రమంగా కేసు పెట్టి జైలుపాలు చేయడం సిగ్గుచేటన్నారు. ఈ కేసు విషయంలో ఉన్న సూత్రదారులు, పాత్రదారులకు తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు. రాష్ట్రంలో జాగృతి మరింత ఉత్సాహంతో పనిచేయనుండగా, బిసిల హక్కుల సాధన, 42 శాతం రిజర్వేషన్ అంశాలపై రాజీలేని పోరాటం చేస్తామని తెలిపారు.

## కాలువ మరమ్మతులకు రూ.10 వేల ఆర్థిక సహాయం

**చిన్నకోడూరు, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త :** మండల పరిధిలోని రంగనాయకసాగర్ కాలువ నుంచి ఎల్లమ్మ జాలు మీదుగా దేవతల ఒర్రె ద్వారా మేడిపల్లి మంగనోని కుంటకు సాగునీటి కోసం తీసిని కాలువ పనులు మధ్యలో ఆగిపోగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యపై రైతులు యువ నాయకులు వంగ రాజేశ్వర్‌రెడ్డిని కలిసి తెలియజేయగా ఆయన వెంటనే స్పందించి కాలువ ప్రాంతాన్ని పరిశీలించారు. తన వంతు సహాయంగా రైతులకు రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు. సాగునీటి సరఫరా సక్రమంగా జరిగేలా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు వంగ రాజేశ్వర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రైతులు భీమయ్య, రాజిరెడ్డి, దేవయ్య, బాలయ్య, పోచయ్య, రోహిత్‌రడెడ్డి, సందీప్, లింగం తదితరులు పాల్గొన్నారు.

## కొమురవెల్లిలో దోమల నివారణకు చర్యలు

**కొమురవెల్లి, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని అన్ని వీధుల్లో శుక్రవారం దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టారు. గ్రామంలో దోమలు వృద్ధి చెందకుండా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని సర్పంచ్ గొల్లపల్లి పద్మఆంజనేయులు అన్నారు. చెత్త, చెదారాన్ని రోడ్లపై మురికి కాల్వల్లో వేయొద్దన్నారు. గ్రామంలో ఎక్కడా మురికి నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ తమ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.కార్యక్రమంలో ఉప సర్పంచ్ పోతుగంటి శ్రీనివాస్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి సిహెచ్.కరుణాకర్, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

### కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి హరికృష్ణ

**సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** ప్రజల అభివృద్ధి, సంక్షేమమే కాంగ్రెస్ సర్కార్ ధ్యేయమని నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ అన్నారు. మండల పరిధిలోని బక్రిచెప్యాల గ్రామంలో ఇందిరమ్మ పథకం కింద నిర్మించిన ఇల్లును ఆయన శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. గూడులేని ప్రతి పేదకు ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ఇల్లు మంజూరు చేస్తుందన్నారు. పేదలకు ఇల్లు అనేది కేవలం నివాసం మాత్రమే కాదని వారి ఆత్మగౌరవానికి ప్రతీక అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు సామాన్య ప్రజల జీవితాల్లో వెలుగు నింపుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ముద్దం లక్ష్మీ, బిక్షపతి, అంజయ్య, సర్పంచ్ నర్సింహారెడ్డి, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గజ్వేల్‌లో చలివేంద్రం ప్రారంభం

**గజ్వేల్ టౌన్, ఫిబ్రవరి 27 (ప్రభాతవార్త):**

గజ్వేల్ పట్టణంలో నేను సైతం రండి సమాజానికి సేవ చేద్దాం మరియు ఎస్ఆర్ గ్రూప్స్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని శుక్రవారం 14వ వార్డు కౌన్సిలర్ గుంటుకు లక్ష్మి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ గ్రూప్స్ నిర్వాహకులు గ్రంథం శ్రీనివాస్, వేముల శివకుమార్, గొట్టిముక్కల హరిప్రసాద్‌గౌడ్, మహేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## దత్తగిరి మహారాజ్ వార్షిక అమరతిథికి అంకురార్పణ

### -బెల్లాపూర్ నుంచి ప్రారంభమైన పాదయాత్ర పల్లకీసేవ



బెల్లాపూర్ నుంచి ప్రారంభమైన పాదయాత్ర పల్లకీసేవ దృశ్యం

**మనూర్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:**
గత 46 సంవత్సరాలుగా ప్రతి సంవత్సరం కొనసాగుతున్న పాదయాత్ర పల్లకీసేవ ఈ నెల 27వ తారీఖు నుంచి మార్చి 5వ తేదీ వరకు కొనసాగించేందుకు తగు ఏర్పాట్లు పూర్తి చేశామని, శుక్రవారం పాదయాత్ర పల్లకి సేవను ప్రారంభించినట్లు ఝరాసంగం మండల పరిధిలోని బర్దీపూర్ గ్రామంలోని శ్రీదత్తగిరి ఆశ్రమ పీఠాధిపతులు 1008 వైరాగ్య శిఖామణి 1008 అవధూతగిరి మహారాజ్, 1008 మహంత్ మహా మండలేశ్వర్ డాక్టర్ సిద్దేశ్వరానందగిరి మహారాజ్‌లు తెలిపారు. పాదయాత్ర చేసే భక్తులు ఈ నెల 9వ తారీఖున బెల్లాపూర్ ఆశ్రమానికి చేరుకోవాలని దత్తగిరి ఆశ్రమ పీఠాధిపతులు పేర్కొన్నారు.

**5న దత్తగిరి మహారాజ్ వార్షిక అమరతిథి...**
మార్చి 5వ తారీఖున ఝరాసంగం మండలం బర్దీపూర్ గ్రామంలోని శ్రీ దత్తగిరి ఆశ్రమంలో దత్తగిరి మహారాజ్ (పెద్దప్ప) వార్షిక అమరతిథిని పురస్కరించుకుని ఆశ్రమంలో పూజా కార్యక్రమాలు నిర్వహించేందుకు తగు ఏర్పాట్లు పూర్తిచేశారు.

## జడ్పిహెచ్‌ఎస్‌లో స్వయం పరిపాలన



జడ్పీహెచ్‌ఎస్‌లో స్వయం పరిపాలన జరుపుకుంటున్న విద్యార్థులు

**చౌటకూరు, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని శివంపేటలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో శుక్రవారం విద్యార్థులు స్వయంపరిపాలన దినోత్సవాన్ని ఉత్సాహంగా జరుపుకున్నారు. ప్రధానోపాధ్యాయులుగా వి.సంపూర్ణ, జిల్లా కలెక్టర్‌గా భార్గవి, డిఈఓగా నితిన్, ఎంఈఓగా మౌనిక, ఆయాపాఠ్యాంశాల ఉపాధ్యాయులుగా విద్యార్థులు ఒకరోజు బాధ్యతలు స్వీకరించి తోటివిద్యార్థులకు విద్యాబోధనచేశారు. ఉపాధ్యాయులుగా, అధికారులుగా సేవలందించిన విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేదశ్రీ, ఉపాధ్యాయులు వీరేశం, శైలజ తదితరులు విద్యార్థులను అభినందించారు. ఉత్తమప్రతిభ కనబర్చిన ఒకరోజు ఉపాధ్యాయులకు ప్రధానోపాధ్యాయులు వేదశ్రీ బహుమతులు అందచేశారు.

## విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



ఉపాధ్యాయులుగా మారిన విద్యార్థుల దృశ్యం

**నారాయణఖేడ్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:**
నిజాంపేట మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో బుధవారం స్వయంపరిపాలన దినోత్సవాన్ని విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థుల్లో కలెక్టర్‌గా ఇస్రాక్ బేగం, డిప్యూటీ కలెక్టర్‌గా ప్రత్యూష, ఆర్జీడిగా అంజలి, డిఈఓగా శశిప్రియ, డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్‌గా స్పందన, ప్రధానోపాధ్యాయురాలిగా హారిక బాధ్యతలు నిర్వహించగా, గణిత ఉపాధ్యాయులుగా మూడ్ సంధ్య, హిందీ ఉపాధ్యాయులుగా రోహిత్, తెలుగు ఉపాధ్యాయులు హేమలత, ఇంగ్లీష్ ఉపాధ్యాయులుగా నందిని, వ్యాయామ ఉపాధ్యాయులుగా వరుణ్‌తేజ్, కిరణ్, బయోసైన్స్ ఉపాధ్యాయులుగా నాగేశ్వరి, ఫిజికల్‌సైన్స్ ఉపాధ్యాయులుగా హుస్సేన్ బి, వందన, ధ్రువకుమార్, దుర్గకుమార్, శ్రీవర్షిని, దీపిక, వరుణ్‌తేజ్, అరుణ్, మోనిక, నందిని, ప్రియాంక, కిరణ్, నందిత, రఘునాయక్, శ్రీవాణి, నరేష్, యశ్వంత్, చందన, శరత్, నందిత, ధనలక్ష్మి, రామ్‌చరణ్, శ్రీకాంత్, సాయి, ఓంకార్, చరణ్, అంజి, మల్లేష్, మణికంఠ, ప్రత్యూష, సంధ్య, మల్లేష్ వ్యవహరించి అలరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, తెలంగాణ స్టేట్ టీచర్స్ యూనియన్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరాథోడ్, సీనియర్ ఉపాధ్యాయులు ప్రవీణ్‌కుమార్, దేవిసింగ్ గురూజీ, మారుతి, లక్ష్మణ్, విజయ్ కుమార్, స్వతంత్రం, భారతి, సురేఖ, సుశీల, తదితరులు పాల్గొన్నారు.

## మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులుగా దత్తు



సర్పంచులఫోరం అధ్యక్షులు దత్తును సన్మానిస్తున్న సర్పంచుల దృశ్యం

**మనూర్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:**
మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులుగా మండల పరిధిలోని దోసపల్లి సర్పంచి బిరాదర్ దత్తును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలసర్పంచుల ఫోరం ఉపాధ్యక్షులుగా రానాపూర్ సర్పంచి ఎంబడి సంగారెడ్డి, గౌరవ అధ్యక్షులుగా బెల్లాపూర్ సర్పంచి రేష దిగంబర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా తుమ్నూర్ సర్పంచి సంజీవులు, కమిటీ సభ్యులుగా ముగ్దంపూర్ సర్పంచి మోహన్‌రెడ్డి, బోరంచ సర్పంచి బీరప్పలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## ఉపాధ్యాయులను అవమానించడం సమాజానికి మంచిది కాదు

### -ఎస్‌టియు రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి సయ్యద్ సాబేర్ అలీ ఆవేదన



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌టియు నాయకులు

**నారాయణఖేడ్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:**
తెలంగాణ విద్యాకమిషన్ ప్రభుత్వానికి సమర్పించిన ఎడ్యుకేషన్ పాలసీ ఫర్ తెలంగాణ 2026 రిపోర్టులో టీచర్లకు జీతాలు ఎక్కువగా ఉన్నాయి అనే అంశాన్ని చేర్చడం అత్యంత విడ్డూరమని స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్ (టిఎస్‌యుటిఎఫ్) రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి సయ్యద్ సాబేర్ అలీ, జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు శ్రీనివాస్‌రాథోడ్, జీవన్‌రాథోడ్‌లతో కలిసి ఒక ప్రకటనలో తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. ఈ వ్యాఖ్యలు ఉపాధ్యాయుల వృత్తిగౌరవాన్ని దెబ్బతీసేవిధంగా ఉన్నాయని, సమాజంలో ఉపాధ్యాయులపై తప్పుగా సంకేతాలు వెళ్ళే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వం ఈవ్యాఖ్యలను తొలగించాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ప్రతాపరెడ్డి, నిజాంపేట, సంగారెడ్డి, రామచంద్రాపురం, నారా యణఖేడ్, జహీరాబాద్ అధ్యక్షులు విజయకుమార్, అంజద్ అలీ, ప్రకాష్, శివాజీ, మాజీద్, నాయకులు లక్ష్మయ్య, ఎన్కేశాలి, రమణకుమార్, ఖయ్యూం తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల భద్రతే లక్ష్యంగా అరైవ్ అలైవ్

### -పట్టణంలో ట్రాఫిక్ సిగ్నల్స్ ప్రారంభం
### -డ్రైవర్లకు కంటి పరీక్షలు-జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్




అరైవ్ అలైవ్ సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ పరితోష్ పంకజ్

**జహీరాబాద్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:**
అరైవ్ అలైవ్-2026 రోడ్డుభద్రత వారోత్సవంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని ఆదర్శనగర్ కాలనీ, పస్తాపూర్ చౌరస్తాల్లో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్స్‌ను జిల్లా ఎస్పి పరితోష్ పంకజ్ ప్రారంభించారు. పట్టణంలోని ఎస్‌వి ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటుచేసిన మెగా ఐ చెకప్ మెడికల్ క్యాంప్‌ను ప్రారంభించి సబ్‌డివిజన్ పరిధిలోని డ్రైవర్లకు (ఆర్టీసి డ్రైవర్లకు, స్కూల్‌బస్సు డ్రైవర్లకు, లారీలు, ఆటోల డ్రైవర్లకు) కంటి పరీక్షలు నిర్వహించారు. ఆ సందర్భంగా ఎస్‌పి పరితోష్ పంకజ్ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించి ప్రజల ప్రాణాలు రక్షణ కల్పించేందుకే అరైవ్ అలైవ్ కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రజలకు వారివారి గమ్యస్థానాలకు సురక్షితంగా చేర్చడంతో పాటు తమ ఇళ్లకు క్షేమంగాచేరే బాధ్యత డ్రైవర్‌లపై ఉంటుందని గుర్తుచేశారు. నిబంధనలు పాటిస్తూ వాహనాలను తోలాలని డ్రైవర్లకు సూచించారు. కార్యక్రమంలో డిఎస్‌పి సైదానాయక్, సిఐ శివలింగం, జక్కుల హనుమంతు, మున్సిపల్ చైర్మన్ మహ్మద్ యునూస్, వైస్‌చైర్మన్ శిరీషసురేందర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ జైత్రం, ఆర్‌టిసి డిపో మేనేజర్ స్వామి, మోటారు వెహికల్ ఇన్స్‌పెక్టర్ వెంకటయ్య, పట్టణ, రూరల్ ఎస్‌ఐలు వినయ్‌కుమార్, కాశీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాకాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడుగా కరణం సందీప్



నియామక పత్రం అందజేస్తున్న నిర్మాలాజగ్గారడ్డి

**సదాశివపేట, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:**
సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడుగా సదాశివపేట మండలం తంగేడుపల్లి గ్రామానికి చెందిన కరణం సందీప్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసిన రాష్ట్ర సేవాదళ్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్, అనంతరం కరణం సందీప్ మాట్లాడుతూ, రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం నాపై నమ్మకంతో ఈపదవిని అప్పజెప్పినా, ముందుగా రాష్ట్ర ప్రభుత్వానికి, టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, టిజిఐఐసి చైర్మన్ నిర్మలాజగ్గారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉండి, ప్రజలకు సేవలందిస్తానని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## పసిపాపను చంపిన దుండగులను కఠినంగా శిక్షించాలి



పసిపాప మౌనిక మృతికి కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ

**కొండపాక, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:**
కొవ్వొత్తులు వెలిగించి జప్తినాచారంలో రాత్రి పసిబిడ్డ మౌనిక ఆత్మశాంతి ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా మాజీ ఎంపిటిసిల మండల ఫోరం అధ్యక్షుడు చింతల సాయిబాబా మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో మల్లన్నజాతరలో పసిబిడ్డ ప్రాణంతీసిన సంఘటన చాలా బాధాకరమన్నారు. పసిపాప మృతి వార్త రెండు తెలుగు రాష్ట్రాల ప్రజల మనస్సులను చలించిజేసిందన్నారు. కొంతమంది అగ్రకులరెడ్ల అహంకారంతో రజకులు(బిసి) కుటుంబంపై దాడిచేయడం అమానుషమని, అందుకు నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. బిసి, ఎస్సీ, ఎస్టీల మీద జరుగుతున్న దాడులను ఖండిస్తూ ప్రభుత్వం వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి కనకయ్య, సిద్దిపేట ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షుడు వడ్డకొండ రవీందర్, నాయకులు ముస్త్యాల శ్రీకాంత్, ముస్త్యాల స్వామి, విష్ణుమూర్తి, వడ్లకొండ రాజయ్య, రామచంద్రం, ఉపేందర్, దూస భాస్కర్, ఎరోళ్ల కర్ణాకర్, పోతుగంటి శ్రీశైలం, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## కూలీల పట్ల నిర్లక్ష్యం విడనాడాలి



మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నర్సిములు

**సదాశివపేట, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:**
వ్యవసాయ కార్మికసంఘం సదాశివపేట మండలకమిటీ ఆధ్వర్యంలో వెల్టూర్ గ్రామాలలో ఉపాధిహామీ కూలీలతో మాట్లాడి వారిసమస్యలను తెలుసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నర్సిములు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా వ్యవహరిస్తుందని, 125 రోజుల పనులు కల్పిస్తామని మూడు లక్షలకోట్లు బడ్జెట్ కేటాయించాల్సింది పోయి 95వేలకోట్లు మాత్రమే కేటాయించిందని ఈ బడ్జెట్‌తో ఉపాధిహామీ ఎలా కొనసాగుతుందని ప్రశ్నించారు. నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం రెండు ఫోటోలు విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సంవత్సరంలో 200 పనిదినాలను కల్పించాలని లేనియెడల పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు ఆనంద్, శివన్న, దుర్గయ్య, నరసింహులు, మల్లేశం, అనిల్, ప్రశాంత్, సావిత్రి, దేవరాజు, లక్ష్మయ్య, సరిత, రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

## సిడిఅర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండల స్థాయి టోర్నమెంట్

**కొండపాక, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:**
యువత క్రీడల్లో నైపుణ్యం కలిగి ఉండాలని సిడిఅర్ ట్రస్ట్ అధ్యక్షుడు, మాజీ ఉమ్మడి మెదక్ జిల్లా డిసిసిబి అధ్యక్షుడు చిట్టి దేవేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం అయన విలేకరులతో మాట్లాడుతూ యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి చిట్టి లక్ష్మి, రాంరెడ్డి స్మారకార్థం సిడిఅర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మార్చి 1వ తేది నుండి క్రికెట్, వాలీబాల్ క్రీడలను కొండపాక, కుకునూరుపల్లి ఉమ్మడి మండల స్థాయి టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. క్రికెట్‌లో గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ॥ 50 వేలను, రెండవ బహుమతిగా రూ॥ 25 వేలను, వాలీబాల్‌లో మొదటి బహుమతిగా రూ॥ 25 వేలు, రెండవ బహుమతిగా రూ॥ 15 వేలను అందిస్తామన్నారు. అసక్తిగల క్రీడకారులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. క్రీడాస్థలం వేద స్కూల్ ఎదురుగా గ్రౌండ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ క్రీడల్లో పాల్గొనే యువకులు ఎలాంటి ఎంట్రీ ఫీజు చెల్లించవలసిన అవసరంలేదన్నారు.

## పంటపొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

**నిజాంపేట్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:**
నిజాంపేట శుక్రవారం కొత్తపల్లిలో వరి, మొక్కజొన్న పంటలను పరిశీలించిన వ్యవసాయాధికారి ఎవో ఆసియాబేగం మాట్లాడుతూ, వాతావరణంలో మార్పు వల్ల వరిలో బ్యాక్టీరియా తెగుళ్ల పంటలను ఆశిస్తున్నాయని, ప్రతి సంవత్సరం పంటభూములు పంట మార్పిడి విధానాన్ని పాటించినట్లయితే తెగుళ్ల నివారణ తగ్గి అధిక దిగుబడులు సాధించడానికి అవకాశం ఉంటుందని, వ్యవసాయంలో నూతన విధివిధానాలను ఎంచుకొని సేంద్రియ ఎరువుల వాణిజ్య పంటల సాగువైపు దృష్టి సారించి వ్యవసాయంలో కొత్త ఒరవడి సృష్టించాలని అన్నారు. ఈ సీజన్‌కు సరిపడే యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న రైతులు వారీస్ దొర, సాయిలు, మల్లేశం, కుమార్, ప్రశాంత్, సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు లక్ష్యసాధనతో ముందుకుసాగాలి

### -వ్యక్తిత్వవికాస నిపుణులు శ్రీనివాస్



పదవ తరగతి విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**కొండపాక, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:**
విద్యార్థులు పరీక్షల భయంవీడి లక్ష్యసాధనలో ముందుకుసాగాలని వ్యక్తిత్వ వికాస నిపుణులు మాడిదాల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం కుకునూరుపల్లి జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో పదవతరగతి విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా అయన విద్యార్థులకు పలు విషయాలపై అవగాహన కల్పిస్తూ పరీక్షల సమయంలో పాటించాల్సిన పద్ధతులు, సమయ నిర్వహణ, ఒత్తిడిని ఎలా తట్టుకోవాలి అనే అంశాలపై సూచనలు అందించారు. పరీక్షలకు ముందు సరైనప్రణాళిక, పునశ్చరణ విధానం, ఆరోగ్యకరమైన ఆహారం, తగినంత నిద్ర అవసరమని అన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ బచ్చలి సత్తయ్య, ఉపాద్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## బాలికలు అన్నిరంగాల్లో రాణించాలి




బాలికల సాధికారతపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ భవ్య

**కొండపాక, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:**
బాలికలు సాంకేతికరంగంతోపాటు అన్నిరంగాల్లో ముందుండాలని ఫిజియో థెరఫి డాక్టర్ భవ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన కుకునూరుపల్లి పిఎంశ్రీ జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో బాలికల సాధికారతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు విద్యతోపాటు క్రీడల్లోను రాణిస్తూ, సాంకేతికరంగాల్లో ముందుండాలని పిలుపునిచ్చారు. ఎంఈఓ బచ్చలి సత్తయ్య మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల వ్యక్తిత్వవికాసానికి దోహదపడతాయన్నారు. బాలికలు తమప్రతిభను వెలికితీసి సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుల బృందం పాల్గొన్నారు.

## కుకునూరు పాఠశాలను సందర్శించిన డిఈవో



సైన్స్ ల్యాబ్‌ను పరిశీలిస్తున్న డిఈవో విజయ

**వెల్దుర్తి, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:**
మండలంలోని కుక్కునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం జిల్లా విద్యాధికారి విజయ సందర్శించారు. ఈసందర్భంగా మధ్యాహ్న భోజన పథకం పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. అలాగే గ్రంథాలయం, సైన్స్‌ల్యాబ్ ఎంసెట్ పరిశీలించారు. 10వతరగతి విద్యార్థులతో మాట్లాడుతూ ఇష్టపడి చదివి 10లో మంచిఫలితాలు తీసుకురావాలని క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చి ఉపాధ్యాయులు చెప్పేది వినాలని అన్నారు. కార్యక్రమంలో ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు సంతోష్‌కుమార్, టిఎస్‌యటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పద్మారావు, ఉపాధ్యాయులు రవినాగరాజు, చందర్‌దామోదర్, అక్బర్ అలీ, అనురాధ, గాయత్రి, సునీత, శశికళ, నీలిమ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని పరామర్శించిన మున్సిపల్ వైస్‌చైర్మన్

**నారాయణఖేడ్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:**
నారాయణఖేడ్ మున్సిపాలిటీలో 4వవార్డుకు చెందిన కడవాత్ రాములు కుమారుడు కడవాత్ శంకర్ పదిరోజుల క్రితం బైక్‌పై వెళ్తుండడంతో ప్రమాదానికి గురయ్యాడు. ఈసందర్భంగా గురువారం ఆయన ఇంటికి వెళ్లి ప్రమాద బాధితుడు శంకర్‌తో మాట్లాడి ప్రమాదానికిగల కారణాలను వారి సోదరుడు విజయ్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కాలనీలో తిరిగి ఆ కాలనీవాసులతో మాట్లాడి వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా కాలనీవాసులు మున్సిపల్ వైస్‌చైర్మన్ దారం శంకర్‌ని పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ఆయనవెంట మహాదేవ్, శంకర్, ఎల్.శంకర్, సూర్యకాంత్, నర్సింలు, సాయి, దేవిసింగ్, పుండ్లీక్, రవి, గోపాల్, సతీష్ తదితరులు ఉన్నారు.

## రైతువేదికలో రైతులకు అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

**సిర్గాపూర్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:**
మండలకేంద్రమైన సిర్గాపూర్‌లోని రైతువేదికలో రైతులకు హర్బిసైడ్ టాలరెంట్ హెచ్‌టి పత్తి సాగుతో కలిగే ప్రతికూల ప్రభావాలు, భూసార పరీక్ష కార్డు సిఫారసు ఆధారంగా రసాయన ఎరువుల వాడకం, ప్రకృతి వ్యవసాయంపై రైతులకు శిక్షణ తరగతులు, జాతీయ ఆహారభద్రత పథకంలో భాగంగా జొన్నపంటలో యాజమాన్య పద్ధతులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పిఎం కిసాన్ లబ్ధిదారులు ఫార్మర్ రిజిస్ట్రీని విధిగా చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి హరికృష్ణ, వ్యవసాయ విస్తీరణ అధికారి భాస్కర్, సిర్గాపూర్ ఉపసర్పంచి బిక్షపతి, కృష్ణ, రైతులు పాల్గొన్నారు.

## సర్పంచులకు అధికారుల సహకారం అవసరం



సంగారెడ్డిలో సర్పంచ్‌ల శిక్షణ కార్యక్రమం దృశ్యం

**సిర్గాపూర్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:**
పంచాయతీల అభివృద్ధిలో జిల్లా ఉన్నతాధికారుల సహాయసహకారాలు, సూచనలు అవసరమని మండలకేంద్రమైన సిర్గాపూర్ సర్పంచి శ్రీనివాసరావుపాటిల్ అన్నారు. జిల్లాకేంద్రమైన సంగారెడ్డిలో సర్పంచులకు నిర్వహిస్తున్న 5రోజుల శిక్షణ ముగింపు సందర్భంగా శ్రీనివాసరావుపాటిల్ మాట్లాడుతూ పంచాయతీ విధులు, నిధులు, బాధ్యతలపై శిక్షణ కార్యక్రమంతో తెలుసుకున్నామని ఆనందం వ్యక్తంచేశారు. నిబంధనల ప్రకారం పంచాయతీల్లో చేపట్టే అభివృద్ధి పనులకు అధికారుల సహకారం అవసరమని పేర్కొన్నారు.

## మైకోడ్ నుంచి బెల్లాపూర్‌కు రోడ్డు



ఉపాధిహామీలో రోడ్డును నిర్మిస్తున్న దృశ్యం

**మనూర్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని మైకోడ్ గ్రామం నుంచి బెల్లాపూర్ గ్రామ శివారు వరకు జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం నిధులతో ఫార్మేషన్ రోడ్డు పనులు చురుకుగా కొనసాగుతున్నాయి. ఫార్మేషన్ రోడ్డు పనులు పూర్తయితే అటుగా వెళ్లే రైతులకు ప్రయోజనకరంగా ఉంటుందని రైతులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలి

### -సిఐ జాన్‌రెడ్డి



అవగాహన కార్యక్రమంలో సిఐ జాన్‌రెడ్డి, ఎస్సై అమర్‌రెడ్డిలు

**కౌడిపల్లి, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:**
విద్యార్థులు క్రమం తప్పకుండా రోడ్డు భద్రత నియమాలు పాటించి, పాదచారులకు దారిని ఇస్తూనే, ట్రాఫిక్‌నిబంధనలు కచ్చితంగా పాటించి రోడ్డు ప్రమాదాల నివారణకు తమ వంతు కృషి చేయాలని నర్సాపూర్ సిఐ జాన్‌రెడ్డి ఎంజెపిటిబిసిడబ్ల్యుఆర్ పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థులను కోరారు. శుక్రవారం తునికి గ్రామ శివారుల్లో గల ఎంజెపిటిబిసి డబ్ల్యుఆర్ పాఠశాల, జూనియర్ విద్యార్థులకు గురుకులం ప్రిన్సిపాల్ రామ్‌బాబు అధ్యక్షతన రోడ్డు భద్రతకు సంబంధించిన వివిధ అంశాలపై ఒక్కరోజు అవగాహన సదస్సును కల్పించారు. అధికారులు విద్యార్థులతో పరస్పరంగా మాట్లాడి వారి సందేహాలకు సమాధానాలు ఇచ్చారు. కార్యక్రమంలో వీరితోపాటు స్థానిక ఎస్సై అమర్‌రెడ్డి, ఎటిసి జాన్‌వెస్లీ, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మోటార్ రీవైడింగ్ ఇంజనీరింగ్ వర్కర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కారించాలి

### -రాష్ట్ర కోఆర్డినేటర్ సుధాకర్‌పటేల్



యునియన్ వార్షికోత్సవ వేడుకలు జరుపుకొంటున్న దృశ్యం

**కౌడిపల్లి, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:**
తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మోటార్ రీవైడింగ్ ఇంజనీరింగ్ వర్కర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కారించాలని తెలంగాణ మోటార్ రీవైడింగ్ ఇంజనీరింగ్‌యూనియన్ రాష్ట్ర కోఆర్డినేటర్ అల్మాయిపేట సుధాకర్‌పటేల్ డిమాండ్‌చేశారు. శుక్రవారం కౌడిపల్లి మండల కేంద్రంలో తెలంగాణ మోటార్ రీవైడింగ్ ఇంజనీరింగ్ యూనియన్ ఐదవ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర కోఆర్డినేటర్ అల్మాయిపేట సుధాకర్ పటేలల్ హాజరైనారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన కావించి, సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరంతరం కరెంట్‌తో పనిచేసే మాకు ప్రమాదవశాత్తుగా కరెంట్ షార్ట్ సర్క్యూట్ సంభవించి మరణిస్తే మాకుటుంబాలు వీధినపడే పరిస్థితి ఉన్నందున ప్రభుత్వం ఉచితంగా ప్రమాద బీమా పథకం కల్పించాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఈయనతోపాటు జిల్లా కోఆర్డినేటర్లు నందంరెడ్డి, లక్ష్మన్, మండల ఉపాధ్యక్షులు శ్రీశైలం, ఉప్పరి నవీన్, బిక్షపతి, శ్రీనివాస్, సురేష్ పటేల్, నీతిన్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.